ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 13, అక్టోబరు 2025



కడుపు కోత

జిల్లాలో పెరిగిపోతున్న సిజేరియన్‌లు

- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- అవసరం లేకపోయినా ఆపరేషన్
- ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా దోపిడీ
- ప్రభుత్వ వైద్యశాలల్లో అలసత్వం
- దీనిపై అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు ఆందోళన
- సాధారణ కాన్పులు పెంచాలని ఆదేశం



మాతృత్వం ఓ వరం. శిశువుకు జన్మనివ్వడం ఏ తల్లికైనా పునర్జన్మే. అయితే ప్రసవం ఒక ప్రహసనమవుతోంది. తల్లీబిడ్డ ఆరోగ్యానికి క్షేమమైన సాధారణ కాన్పులు కరువవుతున్నాయి. ప్రైవేటు వైద్యశాలలు ధనదాహంతో కాన్పంటేనే కడుపు కోస్తున్నాయి. ప్రభుత్వ వైద్యశాలల్లోనూ సాధారణ ప్రసవాలు మృగ్యమయ్యాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు రెఫరల్ వైద్యశాలలుగా మారాయి. సిజేరియన్‌లపై ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికలతోనైనా కడుపు కోతలు ఆగుతాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



'ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్‌లు పెరుగుతున్నాయి. భగవంతుడు ఇచ్చిన సహజ సిద్ధమైన శరీరాన్ని కోతకు గురి చేయడం సరికాదు. ఇకపై ఈ పరిస్థితి ఉండకూడదు. అత్యధికంగా సాధారణ కాన్పులే జరగాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్‌లు చేయాలి. ఆ దిశగా వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకోవాలి'.

- ఇవి గత నెల 21న అసెంబ్లీలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు సాధారణ ప్రసవం గగనమైంది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి సేవల్లో అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇది ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులకు వరంగా మారింది. కాన్పు అంటేనే కాసులు అన్నట్లు పరిస్థితి తయారైంది. సాధారణ ప్రసవానికి ప్రయత్నించకుండా అవసరం లేకపోయినా సిజేరియన్‌లు చేస్తున్నారు. వివిధ రకాలుగా భయపెట్టి గర్భిణిని, వారి కుటుంబ సభ్యులను అందుకు ఒప్పుకునేలా చేస్తున్నారు. ఆపరేషన్ పేరుతో వేలకువేలు గుంజేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు

జిల్లాలోని ఒంగోలులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), మాతా శిశు వైద్యశాల, మార్కాపురంలో జిల్లా వైద్యశాల ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లు (పీహెచ్‌సీలు) 89, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు తొమ్మిది, ఏరియా ఆసుపత్రులు మరో 9 ఉన్నాయి. వీటిలో ఒంగోలులోని జీజీహెచ్, ఎంసీహెచ్, మార్కాపురంలోని జిల్లావైద్యశాల, వై.పాలెంలోని ఏరియా వైద్యశాలల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. నెలకు సరాసరిన 1,500 కాన్పులు చేస్తున్నారు. వీటిలోనూ ఎక్కువ సిజేరియన్‌లే ఉంటున్నాయి. పీహెచ్‌సీకి వెళితే సీహెచ్‌సీకి, సీహెచ్‌సీకి వెళితే ఏరియా ఆసుపత్రులకు, అక్కడ నుంచి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.

రకరకాలుగా భయపెట్టి ఆపరేషన్లు

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యాన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కొందరు గర్భస్థ శిశువు గుండె వేగంగా కొట్టుకుంటుందని వెంటనే సిజేరియన్ చేయాలని చెప్పి అందుకు అంగీకరించేలా ఒత్తిడి తీసుకొస్తున్నారు. పరీక్షలు, శస్త్ర చికిత్స మందుల పేరుతో వేలకువేలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 300 వరకూ ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయి. వీటిలో గైనిక్ విభాగం ఉన్న వైద్యశాలల్లో నెలకు 2,000కుపైగా కాన్పులు జరుగుతున్నాయి. అందులో 70నుంచి 80శాతం వరకూ సిజేరియన్‌లే ఉంటున్నాయి.

ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సిజేరియన్‌లు పెరిగిపోవడాన్ని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. శిశు మరణాలు తగ్గించడంతోపాటు, తల్లుల ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. సిజేరియన్‌లపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించారు. గత నెల 21న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలని వైద్యశాఖను ఆదేశించారు.

వైద్యారోగ్యశాఖ కదిలేనా?

గర్భిణికి ఆపరేషన్ చేస్తే అందుకు గల కారణాలను రిపోర్ట్‌లో స్పష్టంగా రాయాలి. అయితే వివిధ కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా సిజేరియన్‌లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ ఇప్పటికైనా ఈ వ్యవహారంపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలి. అందుకు వైద్యులకు, వైద్య సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

పారిశ్రామిక అవసరాలకు

3.20 టీఎంసీలు



దొనకొండలోని పారిశ్రామిక పార్క్ (ఫైల్)

- వెలిగొండ నుంచి నీటి కేటాయింపు కోరిన ఏపీఐఐసీ
- దొనకొండకు 1.70, కనిగిరి నిమ్జ్‌కు 1.50 టీఎంసీలు
- సూత్రప్రాయంగా జలవనరుల శాఖ అంగీకారం
- తరలింపు విధానంపై రెండు శాఖల ఇంజనీరింగ్ అధికారులు తీవ్ర కసరత్తు
- తాగునీటికి గత ప్రతిపాదన కన్నా మరో టీఎంసీ అధికంగా కోరిన ఆర్‌డబ్ల్యూఎస్

జిల్లాలోని పశ్చిమప్రాంత సాగు, తాగునీటి అవసరాలకే కాక పారిశ్రామిక ప్రగతిలోనూ వెలిగొండ ప్రాజెక్టు కీలకం కానుంది. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నియోజకవర్గంలోని నిమ్జ్ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే భూములను గుర్తించారు. తమకు బదలాయించిన భూముల్లో ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ద్వారా కొన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేశారు. కనిగిరితోపాటు మార్కాపురం నియోజకవర్గంలోని కొన్నిచోట్ల సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దొనకొండ ప్రాంతంలో భారత రక్షణ రంగానికి చెందిన బీడీఎల్ తమ ఆయుధ ఉత్పత్తి విభాగం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. పారిశ్రామిక అవసరాలకు వెలిగొండ నుంచి 3.2 టీఎంసీలు నీటిని ఇవ్వాలని ఏపీఐఐసీ జలవనరుల శాఖను కోరింది.

ఒంగోలు అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక అవసరాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. పశ్చిమప్రాంతంలో ప్రగతిపై సానుకూల పరిణామాల నేపథ్యంలో భూముల తర్వాత అత్యంతకీలక అవసరమైన నీటి లభ్యతపై ఏపీఐఐసీ చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకోవడం అనువుగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చింది. అందుకోసం జలవనరుల శాఖ ఉన్నతాధికారులను సంప్రదించి ఇరుశాఖలు ఉన్నతస్థాయిలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మొత్తం 3.20 టీఎంసీల నీరు పారిశ్రామిక అవసరాలకు అందించాల్సి ఉంటుందని ఆశాఖ అంచనా వేసింది. అందులో దొనకొండ కారిడార్ ప్రాంతానికి 1.70 టీఎంసీలు, కనిగిరి ప్రాంతానికి 1.50 టీఎంసీలు అవసరమని అధికారులు గుర్తించారు. ఆమేరకు కేటాయింపునకు జలవనరులశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం కూడా తెలిపినట్లు సమాచారం.

నీటి తరలింపుపై కసరత్తు

వెలిగొండ నీటిని పారిశ్రామిక ప్రాంతాలకు సులభతరంగా ఎలా తీసుకెళ్లాలి, డ్యాంలో ఎక్కడి నుంచి తీసుకోవాలి, ఏమార్గంలో తీసుకెళ్లాలి? అనేదానిపై ఏపీఐఐసీకి చెందిన ఇంజనీరింగ్, వెలిగొండ ప్రాజెక్టు అధికారులు సంయుక్తంగా కసరత్తు చేస్తున్నారు. డ్యాం నుంచి పైపులైను ద్వారా ప్రతిపాదిత పారిశ్రామిక ప్రాంతాలలో ఏర్పాటు చేసే రిజర్వాయర్లకు తరలించడం మంచిదన్న అభిప్రాయం వారి భేటీల్లో వ్యక్తమైనట్లు సమాచారం.

తాగు నీటి అవసరాలకు అదనపు కేటాయింపు

వెలిగొండ ప్రాజెక్టు డిజైన్ రూపకల్పన సమయంలో తాగునీటి అవసరాలకు గుర్తించిన నీటి పరిమాణం కన్నా అధికంగా మరో టీఎంసీ కేటాయించాలని గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం నుంచి కూడా జలవనరుల శాఖను ఇటీవల కోరారు. తొలుత వెలిగొండ ద్వారా 15 లక్షల మందికి తాగునీటి కోసం 1.60 టీఎంసీలను డిజైన్‌లో కేటాయించారు. అయితే జలజీవన్ మిషన్ (జేజేఎం)లో పశ్చిమప్రాంతంలోని నియోజకవర్గాలతోపాటు ఇటీవల కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లోని గ్రామాలను కూడా చేర్చారు. ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనల ప్రకారం తాగునీటికి సుమారు 2.60 టీఎంసీల నీరు అవసరమవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేసి ఆ మేరకు కేటాయింపు కోరారు. జలవనరులశాఖ అంగీకారం తెలిపినట్లు సమాచారం.

పోలీస్ శాఖలో బదిలీల కలకలం

- ఇటు విధి నిర్వహణలో తప్పిదాలు.. అటు రాజకీయంగా తీవ్ర ఒత్తిళ్లు
- పొదిలి సీఐపై పడిన తొలివేటు
- రేపోమాపో వైపాలెం, ఒంగోలు రూరల్‌తోపాటు మరికొందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం
- సెలవుపై వెళ్లిన చీమకుర్తి సీఐ
- పోస్టింగ్‌ల కోసం విశ్వప్రయత్నాల్లో పలువురు


పొదిలి సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేష్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు : పోలీసు శాఖలో బదిలీల కలకలం ఆరంభమైంది. ముఖ్యంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తాజాగా పొదిలి సీఐపై వేటు పడింది. కొద్దిరోజుల్లో మరికొందరు సీఐలకు కూడా స్థానచలనం కల్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆతర్వాత సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగే అవకాశం కనిపిస్తోంది. పోలీసు శాఖలో జిల్లాకు బాస్ అయిన ఎస్పీ మారినప్పుడు ఆ ప్రభావం కిందిస్థాయి అధికారుల బదిలీలపై కనిపించడం సహజం. దీనికితోడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదుర్కోవాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని తమ పరిధిలోని పోలీసు అధికారుల బదిలీలపై అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు దృష్టి సారించారు. అటు జిల్లాకు కొత్త ఎస్పీ రావడం... ఇటు ఇసుక, మద్యం లాంటి వ్యవహారాల్లో అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటం, ఇంకోవైపు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి పెరగటంతో సీఐలు, ఎస్ఐల బదిలీల వ్యవహారం తెరపైకి వచ్చింది.

మరికొద్దిరోజుల్లో ఇంకొందరు

మరికొద్దిరోజుల్లో ఎర్రగొండపాలెం, ఒంగోలు రూరల్ సీఐల బదిలీ జరగనున్నట్లు తెలుస్తోంది. ఎర్రగొండపాలెం సీఐపై ఫైనాన్స్ వ్యాపారులకు అనుకూలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆయన వ్యవహారశైలిపై పలు ఆరోపణలతో హోంమంత్రి, డీజీపీ నుంచి కిందిస్థాయి వరకు ఫిర్యాదులు చేశారు. ఆయన స్థానంలో అక్కడ పోస్టింగ్ కోసం ఒంగోలు తాలూకాలో పనిచేసిన అజయ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఇక ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌పై బదిలీ వేటు పడే అవకాశం ఉంది. కారణం ఏమైనా ఆ సర్కిల్ పరిధిలోని ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ టీడీపీ నేతలు ఆయన్ను బదిలీ చేయాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌పై ఒత్తిడి తెచ్చారు. తాజాగా ఆయన కూడా అంగీకరించి ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. చీమకుర్తి సీఐగా సుబ్బారావును నియమించిన సమయంలోనే అది వివాదాస్పదమైంది. అప్పట్లో ఎమ్మెల్యే, పోలీస్ శాఖలో టీడీపీ మద్దతు పోలీసు అధికారులు ఇచ్చిన సిఫార్సులకు వ్యతిరేకంగా సీఐ సుబ్బారావు నియామకం జరిగింది. అయితే హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ సిఫార్సు ఆయనకు ఉన్నట్లు పైనుంచి సమాచారం రావడంతో అందరూ సర్దుకుపోయారు. అయితే సదరు సీఐ కుటుంబపరమైన సమస్యలతో దీర్ఘకాలిక సెలవు పెట్టగా ఆదివారం నుంచి మంజూరైంది. దీంతో అటు చీమకుర్తి, ఒంగోలు పోస్టులకు కొత్త సీఐలు వస్తారని సమాచారం. ఆ రెండు పోస్టుల కోసం ఇప్పటికే అరడజనుకు పైగా సీఐలు అటు అధికారులు, ఇటు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్తగా జిల్లాకు వచ్చిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తన పరిధిలోని ఎస్ఐలపై ప్రత్యేక పరిశీలన చేపట్టారు. తదనుగుణంగా మరో వారం, పది రోజుల తర్వాత ఎస్ఐల బదిలీలకు ఆయన శ్రీకారం పలికే అవకాశం కనిపిస్తోంది.

పొదిలి సీఐ బదిలీ.. రాజేష్ నియామకం..!

పొదిలి సీఐ వెంకటేశ్వర్లుపై తొలివేటు పడింది. ఆదివారం ఆయన్ను బదిలీ చేశారు. అక్కడ సీఐగా రాజేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పొదిలి సీఐ బదిలీకి రెండు అంశాలు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ముఖ్యంగా పొదిలి ప్రాంతంలోని ముసి నది నుంచి సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు వత్తాసు పలుకుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఎమ్మెల్యే నారాయణరెడ్డి కూడా సీఐను బదిలీ చేయాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. కొద్దినెలల క్రితం పొదిలి సర్కిల్ కార్యాలయ ఆధునికీకరణ అనంతరం పునఃప్రారంభ కార్యక్రమం జరిగింది. దానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని ఆహ్వానించలేదు. అప్పటి ఎస్పీ సూచన మేరకే అలా చేశానని ఎమ్మెల్యేకు అప్పుడే సీఐ వివరించారు. అప్పటి నుంచి పొదిలి సీఐపై ఎమ్మెల్యే కందుల అసంతృప్తిగా ఉన్నారు. ఎస్పీ బదిలీ అనంతరం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సీఐ బదిలీ కోసం పట్టుబట్టడంతోపాటు ప్రస్తుతం కొత్తగా నియమితులైన రాజేష్‌కు సిఫార్సు లేఖ ఇచ్చినట్లు తెలిసింది.

కొత్త గురువు..

విద్యాభివృద్ధికి ఆదరువు

ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి 184 మంది కొత్త టీచర్లు

- గురుకులాలకు అదనంగా మరికొంత మంది ఉపాధ్యాయులు
- నేటి నుంచి పాఠశాలలకు హాజరు
- గ్రామీణ విద్యలో వికాసానికి నాంది

7

హనీట్రాప్‌తో రూ.11లక్షలు దోపిడీ

స్నేహితురాలితో కలిసి తెలంగాణ విద్యార్థికి టోకరా

- న్యూడ్ కాల్స్ వీడియో బయట పెడతానని బెదిరింపు
- డబ్బు కాజేసిన మార్కాపురం యువకుడు
- ఇంకా కావాలంటూ బ్లాక్‌మెయిల్
- బాధితుడి ఆత్మహత్యాయత్నం
- పోలీసుల అదుపులో నిందితుడు

7

పుష్కలంగా సాగర్ నీరు

- కాలువలకు పెరిగిన పరిమాణం
- ఆయకట్టు భూములకు సక్రమంగా సరఫరా
- ముమ్మరంగా వరినాట్లు

సాగర్ కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఆయకట్టు భూములకు కూడా నీరు సక్రమంగా అందుతోంది. రైతులు వరినాట్లు ముమ్మరం చేశారు. ఈఏడాది పుష్కలంగా వర్షాలు కురవడం, శ్రీశైలం, సాగర్ జలాశయాలు రెండు నెలల క్రితమే నిండడం కారణంగా ముందుగానే కాలువలకు సాగు నీరు విడుదల చేశారు. ఎప్పుడూ అతితక్కువగా సరఫరా అయ్యే ఒంగోలు బ్రాంచ్ కాలువకు కూడా ప్రస్తుతం పుష్కలంగా నీరు వస్తోంది.


ఒంగోలు బ్రాంచ్ కాలువలో పుష్కలంగా సాగర్ నీరు

దర్శి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్‌లో నీరు పుష్కలంగా ఉంది. ప్రస్తుతం సాగర్ కుడి కాలువకు డ్యాం నుంచి 10,040 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా అది బుగ్గవాగుకు చేరుతోంది. అక్కడి నుంచి 8,835 క్యూసెక్కుల నీరు సాగర్ ప్రధాన కాలువకు ఇస్తున్నారు. అక్కడి నుంచి మన జిల్లా సరిహద్దు అయిన 85/3వ మైలుకు 2,846 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దాని నుంచి ఒంగోలు బ్రాంచ్ కాలువకు 1,078 క్యూసెక్కులు, పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 532 క్యూసెక్కుల ప్రకారం పంపిణీ చేస్తున్నారు. మిగిలిన నీటిని దర్శి బ్రాంచి కాలువ పరిధిలోని రైతులు వాడుకుంటున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువ పరిధిలో 1.70లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ కొద్దిరోజుల క్రితం వరకు 750 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా చేశారు. అనేక చోట్ల మేజర్లకు నీరందక, చివరి భూములకు చేరక రైతులు ఇబ్బంది పడ్డారు. ఎన్ఎస్‌పీ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి ఒంగోలు బ్రాంచ్ కాలువకు పరిమాణం పెంచి ప్రస్తుతం 1,078 క్యూసెక్కులు సరఫరా చేస్తుండటంతో అన్ని ప్రాంతాల్లోని ఆయకట్టు భూములకు పుష్కలంగా నీరందుతోంది. దీంతో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

ఇప్పటికే 60వేల ఎకరాల్లో వరినాట్లు

సాగర్ నీటి రాకతో దర్శి, చీమకుర్తి డివిజన్లలో వరిసాగు పెరిగింది. దర్శి డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల ఆయకట్టు ఉండగా ఇప్పటికే 60వేల ఎకరాల్లో నాట్లు వేశారు. చీమకుర్తి డివిజన్‌లో కూడా గతంలో కంటే ఈఏడాది అధికంగా సాగు చేస్తున్నారు. వరినాట్లు పూర్తయ్యేవరకు నీటి సరఫరాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

కార్యకర్తల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

● మంత్రి శ్రీ బాలవీరాంజనేయ స్వామి



మాధవ కుటుంబానికి చెక్కును అందిస్తున్న మంత్రి స్వామి

పొన్నలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ తొలి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల చనిపోయిన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షలు సంక్షేమ బీమా చెక్కును ఆదివారం తూర్పునాయుడు పాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి అందజేశారు.

పెట్రోల్ బంకును ప్రారంభించిన సత్య



పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామేపల్లి గ్రామంలో కార్తికేయ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించారు. క్యాష్ కౌంటర్, పెట్రోల్ పంప్‌ను ప్రారంభించిన సత్య ప్రారంభం సందర్భంగా మొదటి వాహనానికి పెట్రోల్ కొట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామేపల్లి పరిసరాల్లోని వినియోగదారులకు మేలైన సేవలు అందించాలని ఆయన ఈసందర్భంగా యజమానులకు సూచించారు. కార్యక్రమంలో బంకు యజమాని, టీడీపీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి (పెదబాబు) పాల్గొన్నారు.

● కార్తికేయ ఫిల్లింగ్ స్టేషన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి స్వామి ఆదివారం సాయంత్రం సందర్శించారు. మంత్రికి స్టేషన్ యజమానులు పోటు పెదబాబు, పద్మావతి స్వాగతం పలికారు.

త్రోవగుంటలో అమ్మవార్లకు పాలపొంగళ్లు

● భారీగా హాజరైన భక్తులు



పొంగళ్లు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంటలో ఆదివారం గ్రామస్థులు అమ్మవార్లకు (గ్రామదేవతలకు) పాలపొంగళ్లు సమర్పించారు. గ్రామంలో మహిళలు ఆదివారం ఉదయం శీతాలమ్మకు (బొడ్డురాయి) చద్ది సమర్పించారు. సాయంత్రం అంకమ్మతల్లి, మహాలక్ష్మమ్మ, మారెమ్మ తల్లికి, రాత్రి 9గంటల తరువాత పోలేరమ్మతల్లికి పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు భారీ ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చారు. పాడిపంటలు, పశుసంపద, ఆరోగ్యంగా ఉండాలంటూ గ్రామదేవతలను వేడుకున్నారు. సోమవారం పుట్లమ్మతల్లి, మరెడమ్మతల్లి, ఆట్లమ్మతల్లికి పాలపొంగళ్లు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న కరుణాకరరెడ్డి

చీమకుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో సరుకులు తెచ్చుకోవటానికి వీలుగా కూటమి ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని పి.నాయుడుపాలెంలో చేపట్టారు. మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ఈ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో నారపురెడ్డి, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి ఇస్తర్ల ఏడుకొండలు, సుబ్బారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

పేద కమ్మవారికి అండగా నిలవాలి



సభలో మాట్లాడుతున్న బెజవాడ వెంకట్రావు

ఒంగోలు(రూరల్), అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): సమాజంలో పేద కమ్మవారు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేలా అండగా నిలవాలని కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని కాకతీయ సేవా సమాఖ్య సంఘం భవనంలో సంఘ నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వీరవల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలైన కమ్మవారితోపాటు ఇతర కులాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అందరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కొడాలి వెంకటసుబ్బారావు, మురికొండ బోసుబాబు, నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తి సీఐ సుబ్బారావు దీర్ఘకాలిక సెలవు

● గెలాక్సీ టౌన్‌లో పోస్టు కోసం పోటాపోటీ



సీఐ సుబ్బారావు

చీమకుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు ఆదివారం నుంచి లాంగ్ లీవ్ తీసుకున్నారు. తన సతీమణి అనారోగ్య కారణాల నిమిత్తం ఆయన సెలవు పెట్టారు. దీంతో జిల్లాలోనే పోలీస్‌శాఖలో అత్యంత విలువైన పోలీస్‌స్టేషన్ చీమకుర్తికి స్టేషన్‌హౌస్ ఆఫీసర్(సీఐ)గా రావటానికి పలువురు పావులు కదుపుతున్నారు. సీఐ పోస్టు కోసం రాజకీయ పైరవీలు మొదలయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొనే పనిలో పలువురు సీఐలు నిమగ్నమయ్యారు. కీలకమైన స్టేషన్‌కు వెంటనే సీఐ పోస్టుని ఖాళీగా ఉంచరని భావించిన ఔత్సాహికులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ పోస్టు రేసులో శశికుమార్, మాకినేని శ్రీనివాసరావు, హజరత్తయ్య, దుర్గాప్రసాద్, పాండురంగారావు, సుబ్బారావు, అజయ్‌బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. కాగా చీమకుర్తి, ఒంగోలు రూరల్ సీఐ పోస్టులలో సామాజిక న్యాయం పాటించేలా కనపడుతుంది. ఈనేపథ్యంలో ఒకచోటు కమ్మ, మరోచోట ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సీఐలుకు పోస్టింగ్ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్‌వర్గాల్లో ఈ రెండు పోస్టులు ఎవరికి దక్కుతాయే అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● సంక్రాంతి తర్వాత ట్రంక్‌రోడ్ విస్తరణ
● ఎమ్మెల్యే దామచర్ల
● నగరంలో పర్యటించి పనుల పరిశీలన



కొత్త మార్కెట్ వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి కోసం చేపట్టిన పనులు త్వరితగిన, నాణ్యతలోపం లేకుండా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక గాంధీపార్కు, కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులను, కిమ్స్ హాస్పిటల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. గాంధీపార్కు సమీపంలోని రోడ్డు విస్తరణ, అలాగే పార్కులో మౌలిక వసతుల కల్పన తదితర పనులను పరిశీలించి, పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా, ఆలస్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే నగర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం, భవిష్యత్ తరాల కోసం రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే గాంధీపార్కులో పాత ప్రహరీని తొలగించి నూతనంగా మరో గోడను నిర్మిస్తున్నామని, తద్వారా సమీప రహదారి మరింత విస్తరించి వాహనదారుల రాకపోకలకు సులువుగా ఉంటుందని తెలిపారు. దాంతోపాటు పార్కులో వాకర్స్ కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పించాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. గాంధీ పార్కుల అభివృద్ధి కోసం రూ.50 లక్షలతో పనులు చేపట్టామన్నారు. కొత్తకూరగాయల మార్కెట్ వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రంక్ రోడ్డు విస్తరణ పనులను సంక్రాంతి తర్వాత ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. గతంలో 100 అడుగుల విస్తరించాలని భావించామని, అయితే అందరికీ ఆమోదయోగ్యంగా 80అడుగులకు విస్తరించనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత బీవీఎస్ హాల్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని దామచర్ల వివరించారు. త్వరలోనే ఒంగోలు నగర రూపు రేఖలు మారుతాయని, ప్రజలు మెచ్చేలా నగర అందాలను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి, కమిషనరు వెంకటేశ్వరరావు, ఎంఈ ఏసయ్య, కమ్మ సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్పొరేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే దామచర్ల సమీక్ష నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణలు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు మార్పు, అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్‌లలో ఆక్రమణలపైనా దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు.

ఆపరేషన్ సిందూర్‌లో వైమానికదళం కీలక పాత్ర

మాజీ సైనికుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు ● ఘనంగా ఎయిర్ ఫోర్స్ దినోత్సవం



సభలో ప్రసంగిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక దళం కీలక పాత్ర పోషించిందని, సామాన్య పౌరులకు ఎలాంటి హాని కలగకుండా తీవ్రవాదులను అంతం చేసిందని మాజీ సైనికుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఎయిర్ ఫోర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర జవాన్ విజయస్థూపం వద్ద మాజీ సైనికులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోని అగ్రదేశాలకు దేశాలకు దీటుగా భారత వైమానికదళం ఉందని చెప్పారు. నావికా దళం పటిష్టతతోనే దేశ భద్రత ఆధారపడి ఉంటుందని, ఇప్పటికే పలు యుద్ధాలలో దేశ వైమానిక దళం ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. వాయుసేన గొప్పతనం ప్రతి ఒక్కరూ తెలుసుకుని వైమానిక దళంలో చేరటానికి యువత ముందుకు రావాలని కోరారు. దేశరక్షణ బలంగా ఉంటేనే ప్రజలు సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు. నగర కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్రివిధ దళాలు దేశ సరిహద్దుల్లో ఉండి దేశ రక్షణకు పాటు పడుతున్నాయని చెప్పారు. పురాణ కాలం నుంచి త్రివిధ దళాలు ఉన్నాయన్నారు. నేడు దేశ వైమానిక దళం ఎంత సాంకేతికంగా అభివృద్ధి చెందిందని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మాజీ సైనికులకు అవసరమైన సామాజిక భవన నిర్మాణం, విజయ స్థూప నిర్మాణానికి స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావును ఘనంగా సన్మానించారు. అలాగే కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పాశం వెంకటరెడ్డి, సభ్యులు ఎస్.రాజేష్ కన్నా, కె.బ్రహ్మయ్య, దశరథరామయ్య, సీహెచ్.కృష్ణారెడ్డి, శరత్‌బాబు, కె.వెంకటేశ్వర్లు, ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, మన్నెం వాసుబాబు, చుండూరి శ్రీరామూర్తి, కిమ్స్ వైద్యులు కల్పన, ఐ.వెంకటేశ్వరరెడ్డి, వర్షిత, హైందవి, బి.రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స.హ.చట్టం సామాన్యులకు ఆయుధం

ఎంపీడీవో రవికుమార్ ● 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలుచోట్ల అవగాహన ర్యాలీలు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్



కొండపిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సామాన్యులకు బలమైన ఆయుధమని ఎంపీడీవో రవికుమార్ పేర్కొన్నారు. సమాచారహక్కు చట్టం-2005 అమలులోకి వచ్చి 20 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నాగులుప్పలపాడులో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జవాబుదారితనం, పారదర్శకత, అవినీతి రహిత పాలనకు సమాచార హక్కు చట్టం దోహద పడుతుందన్నారు. ప్రజలు అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి మూర్తి, ఏపీవో దేవరపల్లి రవిబాబు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్): ప్రభుత్వ పాలన పారదర్శకతపై ప్రతి పౌరుడు తెలుసుకునే హక్కు ఉందని ఎంపీడీవో కె.రాజశేఖరరావు పేర్కొన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం సందర్భంగా సమావేశం, అనంతరం సంతపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను గురించి ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. దేశ అంతరంగిక వ్యవహారాలు, దేశ భద్రత, దేశరక్షణ వంటి సమాచారం ఇవ్వటం నిషేధమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రామ్‌కుమార్, ఏపీవో నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

కొండపిలో..

కొండపి: సమాచార హక్కు చట్టం వచ్చి 20ఏళ్ల పూర్తయిన సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అవగాహన ర్యాలీ, గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమకు అవసరమైన సమాచారాన్ని నిర్ణీత గడువులోపల తీసుకోవచ్చని, సమాచారం పొందడం పౌరుల హక్కు అని అన్నారు. ర్యాలీలో కొండపి వీఆర్వో సుశీల, కంప్యూటర్ ఆపరేటర్ కొండపి రాము, ఉపాధ్యాయుడు చల్లా ఆంజనేయులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ ఆవరణ వరకు ఆదివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ స్రవంతి, ఆర్ఐ శివ, మండల టీడీపీ సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపట్నం: సమాచార హక్కు చట్టంతో ప్రభుత్వాలు ప్రజలకు మేలైన పాలన అందించే వీలు కలుగుతుందని సామాజిక సహోద్యమ వేదిక కార్యదర్శి గడ్డం అమృతపాణి అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాత్రి కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రతినిధి పసుమర్తి ప్రసాద్, పాదర్తి శివ, మోషే, జి.అనిల్, కె.ప్రభుకుమార్, ఎం.బాలాజి, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పేరుతో మహిళలకు టోకరా

● ముగ్గురి వద్ద నుంచి రూ.70వేల నగదు అపహరణ

ఒంగోలు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సచివాలయం నుంచి వస్తున్నానంటూ పరిచయం చేసుకొన్నాడు ఆ ఆగంతుకుడు. మీకు ప్రభుత్వం నుంచి కుట్టు, వాషింగ్ మిషన్లు ఉచితంగా ఇప్పిస్తామని నమ్మబలికి వేర్వేరు చోట్ల ముగ్గురి వద్ద రూ.70వేలు అపహరించి పరారయ్యాడు. ఈ సంఘటన ఒంగోలు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. ముందుగా ఇందిరా కాలనీ 11 లైనులో నివాసం ఉండే ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లిన ఆగంతకుడు తాను గతంలో వలంటీర్‌గా పని చేశానని, ప్రస్తుతం మమ్మల్ని సచివాలయంలో ఉద్యోగులుగా తీసుకున్నారని చెప్పాడు. మీకు ఉచితంగా ప్రభుత్వం వాషింగ్, కుట్టుమిషన్లు ఇస్తోందని, అందుకు ఆధార్‌కార్డు జిరాక్స్ కావాలని చెప్పాడు. దీంతో ఆదిలక్ష్మి తన కుమార్తె కావ్యకు ఆధార్‌కార్డు ఇచ్చి జిరాక్స్ తీసుకురావాలని పంపింది. ఈలోపు ఆగంతకుడు హడావుడి చేసి ఓ స్టీల్‌ప్లేట్‌లో చీర, రూ.20 వేల నగదు పెట్టి ఫొటో తీయాలని చెప్పాడు. దీంతో ఆదిలక్ష్మి అలాగే తీసుకు రాగా ఫొటో తీసే సమయంలో మీరు కట్టుకున్న చీర బాగాలేదని, లోపలకు వెళ్లి చీర మార్చుకునిరావాలని చెప్పాడు. దీంతో ఆమె లోపలకెళ్లి వచ్చే సరికి రూ.20 వేల నగదు తీసుకుని పరారయ్యాడు.

కమ్మపాలెంలోనూ అదే తీరుతో బురిడీ..

స్థానిక కమ్మపాలెం రెండో లైన్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న జంపాని వరలక్ష్మి ఇంటికి స్కూటీపై ఓ యువకుడు వెళ్లాడు. మీకు ప్రభుత్వ పథకాలు అందాయా అని అడగా, రాలేదని చెప్పింది. నగదు వచ్చే పథకం ఇద్దరికి మాత్రమే అవకాశం ఉందని చెప్పి పక్క వీధిలో నివాసం ఉంటున్న ఆమె సోదరిని పిలిపించాడు. ఇరువురు రెండు ప్లేట్లలో కొత్త చీర, నగదు పెట్టి ఫొటో దిగాలని చెప్పాడు. వరలక్ష్మమ్మ రూ.30వేలు, చీర ప్లేటులో పెట్టింది. ఆమె సోదరి రూ.20వేలు, చీర ప్లేటులో పెట్టి తెచ్చారు. వారి ఇరువురికి మాయమాటలు చెప్పిన ఆగంతకుడు ఇంట్లోకి వెళ్లి ఆధార్‌కార్డులు తీసుకురావాలని చెప్పి పంపాడు. వారు ఇంటిలోకి అలా వెళ్లిన అనంతరం పళ్లెంలో ఉన్న రూ.50వేలు తీసుకుని పరారయ్యాడు. అయితే బాధితులు ఇరువురు పోలీసులకు సమాచారం ఇవ్వలేదు.

గ్రానైట్ మైనింగ్ రాయల్టీ ఒప్పందాన్ని రద్దు చేయాలి : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ ప్రైవేటు సంస్థకు అప్పగించిన గ్రానైట్ మైనింగ్ రాయల్టీ ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేవారు. గ్రానైట్ పరిశ్రమలను తెరిపించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1నుంచి గ్రానైట్ మైనింగ్ రాయల్టీ వసూలును ఏఎంఆర్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం తగదన్నారు. గతంలో రూ.27వేల రాయల్టీని ఒక్కసారిగా రూ.35వేలకు పెంచడం వల్ల పరిశ్రమలపై అధికభారం పడుతుందని, దీని ప్రభావం వల్ల ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులపై ఉంటుందని, వలస కూలీలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో 2500 ఫ్యాక్టరీల్లో 25వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీటిలో చీమకుర్తి పరిధిలోనే 1200 ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. బిహార్, ఒడిశా, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది వచ్చి ఉపాధి పొందుతున్నారన్నారు. అందువల్ల ప్రైవేటు సంస్థకు అప్పగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ అశోక్

పొన్నలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు సచివాలయంలో ఆదివారం కందుకూరు శక్తి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కె.వి.అశోక్ చౌదరి 55 మంది చిన్నారులకు వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

సంతనూతలపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 13, 14, 15వ తేదీల్లో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యురాలు నాగూర్‌బి తెలిపారు. ఆదివారం పేర్నమిట్టపరిధిలోని పీర్లమాన్యంలో ప్రచారం నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సాయిబాబా సత్సంగం ఆధ్వర్యంలో ఆదివారం సాయిబాబా నగరోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా, సాయినాథుని శరత్‌బాబూజీ చిత్రపటాలను ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి ఎలక్ట్రీషియన్ మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కార్పొరేషన్ నీటి సంపులో ప్రమాదవశాత్తు జారి పడి ఎలక్ట్రీషియన్ సుతారం శ్రీనివాస్ (32) మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని బాలాజీరావు పేట వద్ద ఉన్న నీటి సంపు వద్ద జరిగింది. చెరువుకొమ్ముపాలెంనకు చెందిన శ్రీనివాస్, కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ బేసిక్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటల వరకు అక్కడే విధులు నిర్వహించాడు. ఆ తరువాత ఫోన్ చేసినా తీయలేదని ఆయన తల్లి సీతారావమ్మ చెబుతుంది. ప్రమాదవశాత్తు తన కుమారుడు సంపులోపడి ఉంటాడని పేర్కొంది. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి

● జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు



చర్చిస్తున్న జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూశాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పని చేస్తామని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని రెవెన్యూభవన్‌లో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు అధ్యక్షతన కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం జరిగింది. ముందుగా పలు అంశాలపై చర్చించారు. ఇటీవల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లును కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి తమ సమస్యలతో పాటు జిల్లాలో కంప్యూటర్ల అసోసియేషన్ ఏర్పాటుకు సంబందించి చర్చించారు. ఆయా అంశాలపై రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మదుసూదన్‌రావు ఆధ్వర్యంలో మాట్లాడారు. నూతన జిల్లా అసోసియేషన్ కమిటీ నియామకంపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

170మందికి వైద్యపరీక్షలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

సంతనూతలపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్టు ఫౌండర్ పాతూరి సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం జరిగిన ఈ శిబిరంలో 170మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా రోగులకు నెలరోజులకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు వంశీక్రిష్ణ, ఆసుపత్రి ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్‌చైర్మన్ పీఎస్ఎస్.చౌదరి, సెక్రటరీ రామ్‌గోపాల్, సభ్యులు మల్లారెడ్డి, కవితచ చంద్రావతి, ధనలక్ష్మి, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ పరీక్షను అడ్డుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఒక కార్పొరేట్ కళాశాల అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టును నిలిపివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సీహెచ్.వినోద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా టాలెంట్ టెస్టు పేరుతో విద్యార్థుల నుంచి వంద రూపాయాలు వసూలు చేసి గెలుపొందిన విద్యార్థికి కోటిరూపాయాలు ఇస్తామని ప్రచారం చేయడాన్ని ఖండించారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల కోసం ఇటువంటి టాలెంట్ టెస్టులు నిర్వహించడం సిగ్గు చేటన్నారు. ఈ విధానాలను మానుకోకపోతే తగినమూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వీరస్వామి అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో నాయకులు విజయ్, పాండురంగారావు, సాయి, గంగాంజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కొప్పోలు రోడ్డు రైల్వే ఫ్లైఓవర్ వంతెనకు తూర్పు వైపు దిగువన కల్వర్టు నిర్మాణానికి నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. దీంతో సంబంధిత అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ తక్షణమే అనుమతి ఇస్తే కల్వర్టు నిర్మాణం చేపడతామని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొత్త గురువు.. విద్యాభివృద్ధికి ఆదరువు



ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి 184 మంది కొత్త ఉపాధ్యాయులు

గురుకులాలకు అదనంగా మరికొందరు

నేటి నుంచి పాఠశాలలకు హాజరు

చాలావరకు తీరనున్న టీచర్ల కొరత

గ్రామీణ విద్యలో వికాసానికి నాంది

నియోజకవర్గంలో భర్తీ అవుతున్న పోస్టులు		
మండలం	ఎస్జీటీలు	ఎస్ఏలు
ఎర్రగొండపాలెం	13	35
పుల్లలచెరువు	12	30
దోర్నాల	11	20
పెద్దారవీడు	5	24
త్రిపురాంతకం	4	30

త్రిపురాంతకం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ విద్యకు ప్రజా ప్రభుత్వం పునరుజ్జీవం తెచ్చింది. ఇప్పటివరకు మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆ సమయంలో ప్రజాప్రభుత్వం ఏర్పడగానే చెప్పిన మాట ప్రకారం మెగా డీఎస్సీని ప్రకటించి ఉద్యోగాలు ఇవ్వడం, జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల్లో మూడోవంతు మందిని వెనుకబడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి కేటాయించడం విశేషం. దీంతో ఈ ప్రాంతంలో నేటి నుంచి కొత్తగా వచ్చే గురువులతో గ్రామీణ విద్యా వికాసానికి నాంది పలికినట్టయింది.

ఉదాహరణకు పుల్లలచెరువు ఉన్నత పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులుండగా, ఇక్కడ 24 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఇప్పటివరకు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. కొత్తగా వచ్చే ఉపాధ్యాయుల కోటాలో ఈ పాఠశాలకు సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయులు ఏడుగురు వస్తున్నారు. లెక్కలు, ఫిజికల్ సైన్స్, సోషల్, ఇంగ్లీష్, హిందీ. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు వస్తున్నారు. సబ్జెక్ట్ బోధనకు ఉపాధ్యాయులు రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

● తప్పనిసరి పోస్టులన్నీ భర్తీ...

కొత్తగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పొందిన వారంతా సోమవారం విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 657 మంది ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల ఎంపిక పూర్తయి వారివారి పాఠశాలల్లో చేరుతున్నారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అత్యధికంగా ఖాళీలు ఉండడంతో అక్కడకు ఉపాధ్యాయులు వస్తారో, రారోనన్న ఆందోళనకు జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్ణయం ద్వారా తెరపడింది. అత్యధికంగా ఖాళీలు ఉండడం, కొన్ని పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకుండా ఉండడంతో తప్పనిసరి ఖాళీలను మాత్రమే ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ సమయంలో చూపారు. దీంతో ఉపాధ్యాయులు కూడా అధికారికంగా చూపిన ఖాళీల్లో ఏదో ఒక పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. దీంతో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 45 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీలు), 139 మంది స్కూల్ అసిస్టెంట్ల (ఎస్ఏ) ఖాళీలు భర్తీ అవుతున్నాయి. అంటే నియోజకవర్గానికి కొత్తగా 184 మంది ఉపాధ్యాయులు వచ్చారు. వీరితోపాటు గురుకుల పాఠశాలలకు, ఆశ్రమ పాఠశాలలకు అదనంగా మరో 20 మంది వస్తున్నారు. అంటే నియోజకవర్గానికి 200 మందికి పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. ఈ నియామకాలను బట్టి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయ పోస్టుల్లో మూడోవంతు పోస్టులను నియోజకవర్గానికి కేటాయించడం విశేషం. విద్యా వికాసానికి పునాదులు వేస్తూ ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

పి.ఆంజనేయులు, ఎంఈవో, ఎర్రగొండపాలెం



మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ఖాళీలు చూపడంలోనే అధికారుల నిర్ణయం ద్వారా ఎర్రగొండపాలెం వంటి పాఠశాలలకు నేడు అధికభాగం ఉపాధ్యాయులు వచ్చారు. మొత్తానికి ఇక్కడి సమస్య చాలావరకు పరిష్కారమైనట్టే.

సమాచార హక్కు చట్టం.. బ్రహ్మాస్త్రం

డీఆర్వో ఓబులేశ్



ర్యాలీలో డీఆర్వో, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంలాంటిదని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశ్ చెప్పారు. సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు అక్కడి నుంచి తిరిగి చర్చిసెంటర్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో జరిగిన సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయినందున ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాలీ, సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అడిగిన సమాచారాన్ని అధికారులు అందించాలన్నారు. ప్రజలు ఈ చట్టాన్ని సద్వినియోగంచేసుకొని అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం విజయవాడలోని ప్రధాన సమాచార కార్యాలయం ద్వారా వర్చువల్ కూడా విచారణలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ విషయంలో వ్యక్తిపై హత్యాయత్నం

ఒంగోలు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : మహిళ విషయంలో ఇరువురు వ్యక్తులు గొడవపడి ఒకరు కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన కర్నూలు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న పార్కులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... పేర్నమిట్ట పరిధిలోని దామచర్ల ఆంజనేయులు కాలనీలో నివాసం ఉండే నలబోతుల శ్రీను ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. అదే కాలనీలో నివాసం ఉండే పాలపర్తి సత్యం ఆమె పట్ల చనువుగా ప్రవర్తించాడు. ఈవిషయంలో రెండు రోజుల క్రితం శ్రీను, పాలపర్తి సత్యాన్ని హెచ్చరించాడు. దానిని మనసులో పెట్టుకున్న శ్రీను ఆదివారం తిరిగి సత్యం స్థానిక కర్నూలురోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఆంజనేయస్వామి విగ్రహం వెనుక ఉన్న పార్కులో ఉండగా కత్తితో పొడిచే ప్రయత్నం చేశాడు. సత్యం చేయ అడ్డుగా పెట్టిన చాతి వద్ద కత్తి తగిలి రక్తస్రావమైంది. ఈ మేరకు జీజీహెచ్‌లో చేరి అక్కడ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నుంచి జారిపడి మహిళ మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో నుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం త్రోవగుంటలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరానికి చెందిన మంచికల కుమారి(42) మృతి చెందింది. వివరాలలోకి వెళితే... కుమారి ఆమె కుమార్తె స్నేహ రోసిలిన్‌తో కలిసి కల్వర్ టెంపుల్‌కు వెళ్లారు. అక్కడ నుంచి ఒంగోలు వెళ్లి షాపింగ్ చేశారు. ఆర్టీసీ బస్సుఎక్కి ఒమ్మెవరం వెళుతుండగా మార్గమధ్యలో త్రోవగుంట బస్సు వెళ్లిన తరువాత కుమారి సెల్ ఫోన్ కనిపించలేదు. దీంతో హడావిడిగా వచ్చి డ్రైవర్‌ను బస్సు ఆపాలని అడిగింది. డ్రైవర్ ఆపేలోపే హడవిడిగా బస్సు దిగేందుకు ప్రయత్నించి కింద పడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన కుమారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి కుమారుడు నాగ్రేంద కుమార్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హనీట్రాప్‌తో రూ.11 లక్షలు దోపిడీ

స్నేహితురాలితో కలిసి తెలంగాణ విద్యార్థికి టోకరా

'న్యూడ్' కాల్స్ వీడియో బయటపెడతానని బెదిరింపు

పోలీసుల అదుపులో మార్కాపురం యువకుడు

మార్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో పరిచయమైన అమ్మాయితో కలిసి.. తెలంగాణకు చెందిన మరో విద్యార్థిని ట్రాప్ చేశాడు. ఆమెతో అతనికి 'న్యూడ్' కాల్స్ చేయించి.. ఆ వీడియోలు ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించి.. ఆ విద్యార్థి నుంచి రూ.11 లక్షలు కాజేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. మార్కాపురానికి చెందిన 19 ఏళ్ల విద్యార్థి సంజయ్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఆయనకు ఫేస్‌బుక్ ద్వారా విజయవాడకు చెందిన ఓ యువతి పరిచయమైంది. ఆమెతో కలిసి హనీట్రాప్ ద్వారా డబ్బులు సంపాదించాలని సంజయ్ యోచించాడు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా హత్నూరు మండలం కోనంపేటకు చెందిన ఓ విద్యార్థికి ఆ యువతితో వీడియో కాల్ చేయించేవాడు. ఈ క్రమంలో వారి మధ్య 'న్యూడ్' కాల్స్ కూడా నడిచాయి. ఆ కాల్స్‌ను రికార్డు చేసిన సంజయ్ వాటిని తెలంగాణ విద్యార్థి వాట్సాప్ నంబర్‌కు పంపాడు. తనకు డబ్బులివ్వకుంటే వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన తెలంగాణ విద్యార్థి పలు దఫాలుగా సంజయ్ చెప్పిన వివిధ బ్యాంకు ఖాతాలకు రూ.11 లక్షలు పంపాడు. అయినా ఇంకా డబ్బులు కావాలంటూ సంజయ్ వేధిస్తుండటంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. మార్కాపురానికి చెందిన సంజయ్‌ను ఆధారాలతో సహా గుర్తించారు. ఈ క్రమంలో సంగారెడ్డి సీసీఎస్ సీఐ రామానాయుడు సిబ్బందితో కలిసి ఆదివారం మార్కాపురం వచ్చి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతేకాక డబ్బులు ఖాతాల్లో పడిన సంజయ్ స్నేహితులను కూడా విచారణ నిమిత్తం సంగారెడ్డికి తీసుకెళ్లారు.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి

పార్లమెంట్ మాజీ సభ్యుడు

డాక్టర్ తులసిరెడ్డి



ప్రసంగిస్తున్న పార్లమెంటు మాజీ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

గిద్దలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి నిధులన్నీ కేటాయించి తక్షణమే పూర్తి చేయాలని పార్లమెంట్ మాజీ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విశ్వభారతి పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వెలిగొండ పూర్తయ్యేనా? తాగు, సాగు నీటి కష్టాలు తీరేనా? అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమానికి పలువురు నాయకులు, మేధావులు, విద్యావంతులు, రైతులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ మాజీ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో వెలిగొండ ప్రాజెక్టుకు 3,600 కోట్లు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగు, 15లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. నిధులను సంక్షేమ పథకాలకు కేటాయిస్తూ సాగునీటి ప్రాజెక్టులకు మొండిచేయి చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 3 దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై నత్తనడకన సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్రశాఖ అధ్యక్షుడు, శాసన మండలి మాజీ సభ్యులు కేఎస్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రకాశంను వెనుకబడిన జిల్లాల్లో చేర్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక విశ్లేషకుడు పి.ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యంతో, అధికారుల తప్పిదాలతో నత్తనడకన నడుస్తోందన్నారు. నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లించి నాణ్యత ప్రమాణాలతో ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.స్వరూపారెడ్డి, విశ్రాంత తెలుగు ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథరెడ్డి, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, యూటీఎఫ్ నాయకుడు రమణారెడ్డి, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, పలు సంస్థల ప్రతినిధులు శివపురం ఆంజనేయులు, రామిరెడ్డి, ఫరూఖ్, విశ్వరూపాచారి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి సీఐగా రాజేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని మీడియాకు వెల్లడి

పొదిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదిలి సీఐగా ఎం.రాజేష్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తెలియజేయాలని ఆయన సూచించారు. గతంలో కంభం, పామూరు, పల్నాడు జిల్లా గురజాల, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా తెనాలి, అమరావతిలలో పని చేసినట్లు ఆయన తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

అద్దంకి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంపరాల ఎస్సీ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మహిళల చేతిలో పాశుపతాస్త్రం శక్తియాప్

అతివల రక్షణ కోసం ఆరు శక్తి టీమ్‌లు

జిల్లాలో 82 శక్తి హాట్‌స్పాట్‌లు గుర్తింపు

ఆత్మరక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై పోలీసుల అవగాహన



ఒంగోలు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్.. మహిళల చేతిలో పాశుపతాస్త్రం లాంటిది. చేతిలో ఫోన్, అందులో శక్తి యాప్ ఉంటే చాలు, అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చు. ఆ దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోంది.

జిల్లాలో మహిళల భద్రతే ధ్యేయంగా శక్తి యాప్‌లపై అవగాహన కల్పించడంతోపాటు తనను తాను రక్షించుకునేందుకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై కూడా జిల్లా పోలీసు యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. అదే క్రమంలో ప్రత్యేకంగా ఆరు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేసింది. ఇప్పటికే జిల్లాలో 82 శక్తి హాట్‌స్పాట్‌లు గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు జరిగే ఆయా ప్రాంతాలలో మహిళా పోలీసులు సివిల్ డ్రెస్‌లో నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిల అటకట్టించేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా శక్తియాప్ మహిళలకు చేరువయ్యేలా ముఖ్యమైన ప్రాంతాలలో, ఇంటింటికీ తిరిగి శక్తియాప్ డౌన్‌లోడ్ చేయడం, రిజిస్ట్రేషన్ చేయడం చర్యలు చేపట్టారు.

● 82 శక్తి హాట్‌స్పాట్‌లు, ఆరు శక్తి బృందాలు

ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, మహిళలపై దాడులు జరిగే ప్రాంతాలను జిల్లాలో 82 గుర్తించారు. వాటికి శక్తి హాట్‌స్పాట్‌లుగా నామకరణం చేశారు. అందుకు సంబంధించి ఆరు శక్తి బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచారు. ఒంగోలులో మూడు, కనిగిరి, దర్శి, మార్కాపురంలో ఒక్కో బృందం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ శక్తి టీమ్‌లలో ఎస్సై నేతృత్వంలో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు సిబ్బంది సివిల్ డ్రెస్‌లో ఉంటారు. మహిళలకు ఆపద వాటిల్లిన సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఫోన్ కాల్స్‌కు శక్తి బృందాలు చేరుకుంటాయి. వెనువెంటనే వారు స్పందిస్తారు.

● విద్యార్థినుల ఆత్మరక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై అవగాహన

ఆత్మ రక్షణపై ప్రతి విద్యార్థినికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆత్మరక్షణలో భాగంగా శత్రువుల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలని విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పించారు. ఆకతాయిలను ఎదుర్కొనేందుకు ఆత్మరక్షణలో భాగంగా కొన్ని మెళకువలను నేర్పించారు.



● శక్తియాప్ ఆవశ్యకతపై అవగాహన

మహిళలకు రక్షణగా శక్తి యాప్ ఉంటుందని విస్తృతంగా పోలీసులు ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, ముఖ్యకూడళ్లు, కళాశాలలో శక్తి యాప్ ఆవశ్యకత గురించి వివరించి వినియోగించే విధానాన్ని తెలియజేశారు. శక్తియాప్ మహిళలకు పాశుపతాస్త్రంగా పనిచేస్తుంది. శక్తియాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న మహిళలు ఆపదలో ఉంటే ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే వెంటనే పది నిమిషాలలో సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లే అవకాశం ఉంది. అదేవిధంగా సెల్‌ఫోన్‌ను చేతితో పట్టుకొని రెండుసార్లు ఊపితే ఎస్‌ఓఎస్ అలర్ట్ పంపించే అవకాశం ఉంది. అదే విధంగా లైవ్ ట్రాకింగ్ అండ్ ఎవిడెన్స్ షేరింగ్, కాలర్ లొకేషన్ షేరింగ్, 10 సెకండ్ల నిడివి కలిగిన ఆడియోను కంట్రోల్ రూంకు పంపించే అవకాశం ఉంది. మహిళల సహాయం కోసం 112, 181, 1930, 1098 నంబర్లతో పాటు డయల్ 100కు ఫోన్ చేయవచ్చు.

ఆరు శక్తి బృందాలు ఏర్పాటు

శక్తి టీమ్ ఇన్‌చార్జి సీఐ సుధాకర్

జిల్లాలో ఆరు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని శక్తి టీమ్ ఇన్‌చార్జి సీఐ సుధాకర్ తెలిపారు. ప్రతి టీమ్‌కు ఎస్సై ఇన్‌చార్జిగా ఇరువురు మహిళలు, ముగ్గురు పురుషులు సిబ్బంది ఉంటారని చెప్పారు. వారికి శక్తి స్కూటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. వీరు అంతా సివిల్ డ్రెస్‌లో ఉంటారన్నారు. మహిళలకు ఆపద వచ్చిన సమయంలో ఫోన్ కాల్ చేసిన 10 నిమిషాలలో పోలీసులు ఉండే విధంగా చర్యలు తీసుకుటున్నామని చెప్పారు.



ఆక్రమణల తొలగింపుపై మీనమేషాలు


కంభం ఇరిగేషన్ ప్రధాన పంట కాలువను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలు


నక్కల గండి కాలువపై ఇలా


రావిపాడుకు వెళ్లే ప్రధాన పంట కాలువపై వెలసిన అక్రమ కట్టడాలు

- ఇరిగేషన్ పంట కాలువలపై అక్రమ నిర్మాణాలు
- 6నెలలు గడిచినా చర్యలు శూన్యం
- అధికారుల సమన్వయ లోపం.. రైతులకు శాపం

కంభం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువు ఇరిగేషన్ పంట కాలువలపై ఆక్రమణల తొలగింపు విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తతన్నారు. పంట కాలువలను ఆక్రమించి నిర్మించుకున్న అక్రమ కట్టడాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు త్వరలోనే తొలగిస్తామని చెప్పి నేటికీ ఆరు నెలలైనా గడిచినా పట్టించుకోకపోవడంపై స్థానిక రైతుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 'పంట కాలువలపై అక్రమ కట్టడాలు' అనే శీర్షికన మార్చి 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో వచ్చిన ప్రత్యేక కథనానికి స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కంభం, కందులాపురం పంచాయతీల పరిధిలో పంట కాలువలను పరిశీలించి అక్రమ కట్టడాలను గుర్తించారు. తహసీల్దార్ కిరణ్ కందులాపురం పంచాయతీ కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ మ్యాప్ ద్వారా పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా మార్కింగ్ ఇచ్చిన వరకు తొలగించుకోవాలన్నారు. లేని పక్షంలో తామే ఎక్స్‌వేటర్ సహాయంతో తొలగిస్తామని హెచ్చరించారు. ఆ తరువాత ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఆక్రమణల తొలగింపుపై పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్‌ను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా కందులాపురం పంచాయతీ వరకు తమ వద్ద మ్యాపింగ్ ఉందని దానితో అక్రమ కట్టడాలు గుర్తించి మ్యాపింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ కంభం పంచాయితీకి సంబంధించి ఇరిగేషన్ పంటకాలువలపై అక్రమ కట్టడాలను గుర్తించాలంటే కంభం ఇరిగేషన్ కార్యాలయంలోని మ్యాప్ కావాలన్నారు. కానీ ఇరిగేషన్ అధికారులు తమ దగ్గర మ్యాప్ లేదని చెప్తున్నారని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ నాయక్‌ను ప్రశ్నించగా కంభం, కందులాపురం పంచాయతీల పరిధిలో అక్రమ కట్టడాలను గుర్తించాలంటే రెవెన్యూ రికార్డుల ప్రకారం పరిశీలించాలన్నారు. వారి వద్ద మ్యాపు లేదని చెబుతున్నారని, రెవెన్యూ అధికారుల వద్ద మ్యాప్ లేకుంటే మా దగ్గర ఎలా వస్తుందని తెలిపారు.

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం

ఇరిగేషన్ పంట కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించాలంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్చించుకుని మ్యాపులను పరిశీలించాలని కానీ ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం మా రైతులకు శాపంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల ఇరువైపులా అక్రమ కట్టడాల వలన కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం సాధ్యం కావడం లేదని ఇప్పటికైనా ఇరు శాఖల అధికారులు కూర్చుని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


బహుమతులతో విద్యార్థులు

మార్గదర్శి మహాత్మా గాంధీ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికే అహింసా మార్గాన్ని చూపిన మార్గదర్శి జాతిపిత మహాత్మా గాంధీ అని అవోపా రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాచపూడి సుబ్బారావు అన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అవోపా ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులను ఆయన అందించారు. విద్య, వైద్యం సేవా కార్యక్రమాలతో అవోపా ముందుకు వెళ్తుందని సుబ్బారావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచనలో విజేతలను అభినందించారు. సీనియర్ విభాగంలో మేఘనా రెడ్డి, షంషీర్, శ్రీదివ్య ద్వితీయ, కార్తికేయ వైష్ణవి తృతీయ బహుమతులు సాధించారు. పది కన్సొలేషన్ బహుమతులను అందించారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సమీరా, ద్వితీయ బహుమతి టి.డిలియా, తృతీయ బహుమతి సాహితి అందుకున్నారు. కార్యక్రమంలో అవోపా గౌరవ అధ్యక్షులు నూరె వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుడిపాటి వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సభ్యులు రాజశేఖర్, సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు రామసుబ్బారావు, శ్రీనివాసులు, సుబ్బనారాయణ, రామకృష్ణ, రామారావు, లక్ష్మీనారాయణ, గురునాథరావు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్ని రంగాలలో రాణించాలని మనవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీసీ కాలనీ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు, పౌచ్‌లు పంపిణీ చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ నారాయణం లావణ్య, పట్టణ ఎస్ఐ సైదుబాబు, సంస్థ నాయకులు అన్నా రాము, శ్రీనివాసరావు, గుంటక వనజాక్షి, పీవీ కృష్ణారావు, అబ్దుల్ జలీల్ పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడంతో జ్ఞానం


చదువుతున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు ఎంత చదివితే అంత జ్ఞానం పెరుగుతుందని ఎర్రగొండపాలెం గ్రంథ పాలకురాలు కే ఝాన్సీ అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు చదవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముందుగా పలు రకాల పుస్తకాలను, వాటి చరిత్ర గురించి వివరించారు.

సంఘాల్లో సభ్యులకు ఐక్యత ముఖ్యం

త్రిపురాంతకం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంఘాలుగా ఏర్పడడమే కాదు సంఘాల్లో సభ్యులు ఐక్యతగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జున అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఎలక్ట్రీషియన్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి యూనియన్ అధ్యక్షుడు కిషోర్ అధ్యక్షత వహించారు. ప్రతి సభ్యుడు ప్రమాద బీమా కలిగి ఉండాలని సక్రమంగా ప్రీమియం చెల్లింపులు చేయాలని సూచించారు. కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మిగిలిన సభ్యులు అండగా ఉండి సహకారం అందించాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు లాజర్, ఉపాధ్యక్షులు చిన్ని, ఖాదర్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తర్లుపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని మీర్జపేట సచివాలయం వద్ద తర్లుపాడుకు వచ్చే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి తన పుట్టిన రోజు సందర్భంగా మొక్కను నాటి దానిని పెద్దది చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్ద మీరయ్య, కూటమి నాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, మానవ సంస్థ కోశాధికారి శ్రీనివాసరావు, గుంటక చెన్నారెడ్డి, ఆర్‌కేజీ, కశ్శెట్టి జగన్, కిరణ్, నారాయణ, వెంకటేశ్వర్లు, గుంటక వనజాక్షి, మల్లేశ్వరి, రేణుక పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

రాజముద్రతో రేషన్ కార్డులు


కార్డులను పంపిణీ చేస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి


స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

టీడీపీ నేత కృష్ణకిషోర్‌రెడ్డి

కొమరోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జగన్ ఫొటోల తొలగించి తిరిగి రాజముద్రతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, పాసుపుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. మండంలోని గుండ్రెడ్డిపల్లి, అక్కపల్లి, ముత్తరాసుపల్లి రేషన్ షాపుల్లో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాజముద్రల స్థానంలో జగన్‌రెడ్డి ఫొటోలను ముద్రించి రాజ్యాంగాన్ని అవహేళన చేశారన్నారు. రేషన్ కార్డులు, పొలం పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాలు చివరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పెట్టే కోడిగుడ్లపై కూడా జగన్‌రెడ్డి ఫొటోలు ముద్రించడాన్ని ప్రజలు అసహ్యించుకున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజముద్రలతో ముద్రించిన పాసుపుస్తకాలు, ఇప్పుడు రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని తెలిపారు. రాజముద్రతో ఉన్న మీ పాసుపుస్తకాలకు రక్షణ ఉంటుందని కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని రేషన్ షాపులకు చెందిన 11,378 స్మార్టు రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, నడువలేని వారి ఇళ్లకి వెళ్లి డీలర్లే రేషన్‌ను పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడు బిజ్జం రవీంద్రారెడి, పార్టీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బిజ్జం వెంకట్రామిరెడ్డి, వీఆర్వో నాయబ్, నాయకులు మారె శ్రీనివాసులు, అనపా వీరశేఖర్, నాగూర్, చెక్కా పుల్లయ్య పాల్గొన్నారు.

రేషన్ సరుకులకు భద్రత

రాచర్ల : స్మార్ట్ రేషన్ కార్డులు రేషన్ సరుకులకు భద్రత ఉంటుందని కూటమి నాయకులు అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను ఆదివారం వారు గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. చోళ్లవీడులో బత్తిని రామకృష్ణ, శిరిగిరి శ్రీనివాసులు, చిన్నగానిపల్లిలో కంబాల రమణ, సోమిదేవిపల్లిలో బుడమ నాగేశ్వర రెడ్డి, కప్పెట వెంకటేశ్వర రెడ్డి, రెగాని రమణ, సంగపేటలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె అనోజీరావు, గుడిమెట్టలో రెడ్డి కాశిరెడ్డి, ఆయా గ్రామాల వీఆర్వోలు డీయోనా, ఆర్ శివపార్వతి, బీ కిషోర్ కుమార్, ఏ మాచర్ల, అధికారులతో కలిసి కార్డులను పంపిణీ చేశారు.

ఘనంగా పోలేరమ్మ ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.


నూతనంగా ఎన్నికైన గౌడ సంఘ నియోజకవర కమిటీ

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

మార్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం నియోజకవర్గ గౌడ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కపిలగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఇల్లూరి రంగస్వామిగౌడ్ అధ్యక్షతన కమిటీ ఎన్నిక జరిగింది. నియోజకవర్గ నూతన అధ్యక్షులుగా కొమర వెంకటనరసింహరావు, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల నాగార్జునగౌడ్, కోశాధికారిగా వేములకొండ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా జూపల్లి ఏడుకొండలు, అలగాని కృష్ణయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా దొంత కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా కంచర్ల కాశయ్య, హనుమయ్య, గౌరవ సలహాదారులుగా శ్రీనివాసరావు, కొమర వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గజ్జ వెంకటేశ్వర్లుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం సమాచార హక్కు చట్టం

కంభం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి అక్టోబరు 12వ తేదీకి 20 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే శత్రువు అవుతావేమో గాని, ప్రశ్నించకుంటే జీవితాంతం బానిసగానే మిగిలిపోతారని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రాచర్ల : ప్రజా స్వామ్య ప్రక్రియలో సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సమాచార హక్కు చట్టం, దాని విధి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అప్పిలేట్ అధికారి, పౌర సమాచార అధికారి, గ్రామ పంచాయతీల సహాయ పౌర సమాచార అధికారులు, వివోఏలు, స్థానిక నాయకులు కె యోగానంద్, ఎస్ కల్యాణ్ రెడ్డి, పి సనావుల్లా ఖాన్, ఎంవీ సాయి పాల్గొన్నారు.

తర్లుపాడు : సమాచార హక్కు చట్టంపై డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తర్లుపాడులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే కావాల్సిన డాకుమెంట్స్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : చట్టం కల్పించిన హక్కు ద్వారా ప్రతి పౌరుడు అవసరమైన సమాచారాన్ని కోరవచ్చని తహసీల్దార్ కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం వినియోగంపై పలు నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, ఏపీవో సుజాత పాల్గొన్నారు.



రాచర్లలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో



తర్లుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఏసీఎస్ చైరన్ క్రాంతికుమార్

పీఏసీఎస్ చైర్మన్‌గా క్రాంతికుమార్ ప్రమాణం

మార్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్ వెలుగు క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక కంభం రోడ్డులోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా జరిగిన కార్యక్రమంలో కాశీనాథ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రజా ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందరికీ సమన్యాయం చేస్తుందన్నారు. జనసేన పార్టీకి చెందిన వ్యక్తిని కూడా గౌరవించి సొసైటీ చైర్మన్‌గా నియమించడం ప్రజా ప్రభుత్వానికే చెల్లించదన్నారు. నూతన చైర్మన్ క్రాంతికుమార్ మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు శక్తివంచనలేకుండా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, శాసనాల వీరబ్రహ్మం, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జనసేన నాయకులు వెలుగు కాశీరావు, చేతుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

రాచర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం ఆయన తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ లైసెన్స్‌లు, హెల్మెట్లు లేకుండా నడుస్తున్న పలు వాహనాలకు జరిమానా విధించారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, నిబంధనలు అతిక్రమించవద్దని వాహనదారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సురేష్, హోంగార్డులు పాల్గొన్నారు.

కరెంట్ సమస్యలకు పరిష్కారం


కరెంట్ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లు

రాచర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామంలో ఏళ్ల తరబడి కరెంట్ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని గ్రామ నాయకులు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి తెలపడంతో స్పందించిన ఆయన తక్షణమే సం బంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దీంతో ఆదివారం విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్లు ఆకవీడు, ఆరవీటికోట గ్రామాల పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు లాగి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేశారు. అడిగిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి ట్యాంక్‌ను శుభ్రం చేయాలి


పాచిపట్టిన వాటర్ ట్యాంక్

గిద్దలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజానగర్‌లో గ్రౌండ్‌లెవెల్ వాటర్ ట్యాంక్ అపరిశుభ్రానికి కేరాఫ్‌గా మారింది. తరచూ ఈ ట్యాంక్ నిండి నీరు వృథాగా పోతున్నది. దానికితోడు ట్యాంక్‌లో నీటి లీకేజీ కారణంగా ట్యాంక్ చుట్టూ పాచిపట్టింది. దాంతో మహిళలు నీరు తెచ్చుకునే సమయంలో జారి కిందపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ట్యాంక్‌ను శుభ్రం చేసి నీటి లీకేజ్‌ని అరికట్టాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విద్యా సామగ్రి అందజేత

గిద్దలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల బాలికల వసతి గృహానికి చెందిన విద్యార్థినులకు యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అట్టలు, పెన్నులు తదితర వాటిని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి.వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులు రత్నం, సిద్ధయ్య, నాయబ్‌తోపాటు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు బుజ్జమ్మ పాల్గొన్నారు.

పాస్టర్లకు సన్మానం


పాస్టర్‌లను సన్మానిస్తున్న చర్చి సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మానవులను సన్మార్గం బాటలో నడిపించడంలో పాస్టర్ల పాత్ర కీలకమని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి అధ్యక్షుడు దేవరకొండ సామ్యూల్ అన్నారు. స్థానిక తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో పాస్టర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ చిలుకూరి అమృత్‌తేజను సన్మానించారు. కార్యక్రమంలో చర్చి నాయకులు గుర్రం అర్థర్, వై.పోలయ్య, దారివేముల బాబీ, జయకుమార్, కొరప్రోలు జాన్ విజయ్ కుమార్, ప్రకాశ్, దేవరకొండ సుజాత పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కంభం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం దేవనగరం గ్రామంలో ఆదివారం పేకట స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసి రూ.5320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట ఆడటం చట్టరిత్యా నేరమని ఎవరైనా అలాంటి కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తికి గాయాలైన ఘటన దిగువమెట్ట సమీపంలో జరిగింది. అందిన సమాచారం మేరకు రాచర్ల గ్రామానికి చెందిన పిక్కిలి నరేంద్ర దిగువమెట్ట నుండి గిద్దలూరు వైపుకు వస్తున్న క్రమంలో బైకు అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే కిందపడడం వలన గాయాలయ్యాయి. హైవే మొబైల్ పోలీసులు 108కు సమాచారం అందించడంతో నరేంద్రను గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగమ్మ ఆలయ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరుతో పాటు ఇతరప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో సందడి నెలకొంది. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. వాహనదారులు వాహన పూజలు చేయించారు. మరికొందరు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుల ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు చేశారు. పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఈవో జి.వాసుబాబు, ఆర్‌పి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనం నడపాలి

ముండ్లమూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెదఉల్లగల్లులో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీగా జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బి.పవన్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ఏఐ ఉపాధ్యక్షురాలుగా వనజారెడ్డి



పామూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పామూరుకు చెందిన వనజారెడ్డి టీఎన్ఏఐ(ట్రైండ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. నెల్లూరు నారాయణ నర్సింగ్ కాలేజిలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమె రోగులకు ఉత్తమ సేవలు అందించడంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీలో తమ్మలూరు, పెదరావిపాడు గ్రామాల్లో గత వారం రోజుల నుంచి పారిశుధ్య కార్యక్రమాలను సర్పంచ్ గొర్రె శ్రీదేవిరాముడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధుల్లో మురుగును తొలగించటంతో పాటు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, ఎబేట్ పిచికారి చేయించారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

తాళ్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఆదివారం సరదాగా ఈతకు వెళ్లిన శివరాంపురంకు చెందిన యువకుడు సాగర్ కాలువలో పడి మృతి చెందాడు. ఆగ్రామానికి చెందిన గుమ్మడి ముత్యాలు రెండో కుమారుడు సన్ని(23)స్నేహితులతో కలిసి గ్రామ సమీపాన తిప్పవద్దగల సాగర్ కాలువకు ఈతకు వెళ్లాడు. ఈతకు దిగిన సన్ని ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతనికి బయటకు తీసేటప్పటికి మృతి చెందాడు. మృతుడు ఓప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ఏడాది క్రితం వివాహమైంది. యువకుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వారధి నిర్మాణం జరిగేనా..!

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- కర్రలు కట్టుకొని రాకపోకలు సాగిస్తున్న వైనం
- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- ప్రజా ప్రభుత్వంపై కోటి ఆశలు

దొనకొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కాలువపై మూడున్నర సంవత్సరాల క్రితం రాత్రి సమయంలో అకస్మాత్తుగా వంతెన కుప్పకూలింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో ప్రాముఖ్యమైన ఈవంతెన నిర్మాణం గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రజలు రాకపోకలకు పడరానిపాట్లు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్‌కాలువకు అవతలివైపున ఉంది. ఇక్కడికి రాకపోకల నిమిత్తం సాగర్ కాలువపై వారధి నిర్మాణం చేపట్టారు.

2022 ఫిబ్రవరిలో రాత్రి సమయంలో వంతెన ఒక్కసారిగా కాలువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. వంతెన నిర్మాణం గురించి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతిరోజు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలు ఏర్పాటుచేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆసమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు ఉన్నాయి. పశుపోషకులు తప్పనిసరై పశువులను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన గుండా ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నారు.

సాగర్ కాలువలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెన పై నుంచి రాకపోకలు జరుపుకునేందుకు కుదరకపోవటంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గే వరకు తప్పనిసరిగా చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లటం తప్పనిసరి. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన సాగర్ కాలువపై వంతెన నిర్మాణం గురించి గత వైసీపీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగర్ కాలువపై వంతెన నిర్మాణం పనులు ఎప్పుడు చేపడుతుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



సాగర్ కాలువపై కూలిన వంతెన

సమాచారం కోరటం ప్రతి పౌరుడి హక్కు

- ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమాచారం కోరటం ప్రతిపౌరుడి రాజ్యాంగ హక్కు అని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. సమాచారం హక్కు ఏర్పాటై 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం రెవెన్యూశాఖతో పాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో సమాచార హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోనూ, కార్యాలయాల్లోనూ ఏదైనా సమాచారం అవసరమైతే ఆర్టీఐ - 2005 చట్టం ప్రకారం సంబంధిత అధికారులు, యజమానులు నిర్ణీత కాల వ్యవధిలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ హక్కును ఉల్లంఘించటం చట్టరీత్యా నేరంగా పరిగణించటం జరుగుతుందన్నారు. సమాచా రం కోరేవారు కూడా తప్పనిసరిగా చట్టం విధి, విధానాలను అనుసరించాల్సి ఉంటుందన్నారు. చట్టం యొక్క ఉద్దేశాన్ని పక్కదోవ పట్టించేవారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు కూడా రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతిఒక్కరూ ఆర్టీఐ చట్టం గురించి అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయా ల్లో తప్పనిసరిగా ఆర్టీఐ నిబంధనలు తెలిపే బోర్డును ఏర్పాటుచేయాలని సూచించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ ఏరవిశంకర్, ఎలక్షన్ డీటీ పీవీ రమణారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, పురుషోత్తంరెడ్డి, రమేష్, వీఆర్వోలు శ్రీకాంత్, ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, వెలుగు సీసీ జిలాని, ఆరోగ్యశాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రవిశంకర్ తదితరులు

డంపింగ్ యార్డులుగా రహదారులు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మొక్కుబడిగా పారిశుధ్య కార్యక్రమాలు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వీధులన్నీ మురికికూపాలుగా మారాయి. వీధుల్లో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రధాన రహదారులన్నీ డంపింగ్ యార్డులుగా మారాయి. గ్రామాల్లో చెత్తాచెదారాన్ని రహదారుల పక్కన పడవేస్తున్నారు. దీంతో ఆమార్గాల్లో వెళుతున్న ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

ముండ్లమూరులోని తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి డంపింగ్ యార్డుగా మారింది. వీధుల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను తీసుకువచ్చి రహదారి పక్కన పడవేస్తున్నారు. ముండ్లమూరు నుంచి సింగనపాలెం వెళ్ళే ప్రధాన రహదారి కూడా డంపింగ్ యార్డును తలపిస్తుంది. పసుపుగల్లులోని ఎస్సీ కాలనీ సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన పలు చోట్ల వ్యర్థ పదార్థాలు పడవేస్తున్నారు. పులిపాడుతోపాటు మారెళ్ళ, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, భీమవరంతో పాటు వేముల, కెల్లంపల్లి, నాయుడుపాలెం, తమ్మలూరు వేములబండ గ్రామాల్లో వ్యర్థపదార్థాలను రోడ్ల పక్కన వేస్తున్నారు. ఇటీవల కురిసన వర్షాలకు వ్యర్థపదార్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఆమార్గాల్లో ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే రహదారి పక్కన పడవేసిన వ్యర్థపదార్థాలు

బసవాపురంలోని పాఠశాలకు సమీపంలో మురుగు కాలువ అధ్వానంగా ఉంది. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినా మండలంలోని పలు గ్రామాల్లో అలాంటి పరిస్థితి కన్పించడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు మొక్కుబడిగా పర్యటిస్తూ మమ అనిపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల పూరిమెట్ల, పసుపుగల్లుతో పాటు పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛ గ్రామాలుగా తయారుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



బసవాపురం పాఠశాల సమీపంలో పేరుకుపోయిన మురుగునీరు

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

పామూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులో వెలసిఉన్న శ్రీహజరత్ మహబూబ్‌సుభాని స్వామివార్ల 49 ఉరుసు గంధ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా వద్ద సీఐ ఎ.భీమానాయక్, ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరనాయక్, ఎం.కృష్ణపావని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో దర్గా

కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు షేక మౌలాలి, కోడిగుంపుల నాయబ్‌రసూల్, పులి నాయబ్, కావేరి రసూల్, పత్తు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు షేక్ గయాజ్ ఇంటి వద్ద నుంచి స్వామి జండాను గ్రామోత్సవం చేసుకొంటు దర్గా వద్దకు చేర్చారు. అనంతరం షేక్ పులి కాశిం, హజిగౌస్, రహిమాన్, షేక్ రషిద్, జడదేవి మస్తాన్‌చే భక్తులకు అన్నదానం నిర్వహించారు. దర్గా వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున సయ్యద్ గౌస్‌బాషా ఇంటివద్ద నుంచి మేళతాళాలతో గంధాన్ని దర్గా వద్దకు చేర్చారు. గంధం ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.



దర్గా వద్ద ప్రార్థనలు చేసిన పోలీసులు



ముండ్లమూరు పశువైద్యశాల

పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు

- సకాలంలో అందని సేవలు
- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

ముండ్లమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముండ్లమూరు, ఈదర పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కయ్యారు. గత రెండు సంవత్సరాలుగా ఈదర పశు వైద్యశాలకు రెగ్యులర్ పశువైద్యాధికారి లేక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మారెళ్ళ పశువైద్యాధికారిగా పనిచేస్తున్న కాశిరెడ్డి ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. ముండ్లమూరు పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి రెండు నెలల క్రితం ప్రసూతి సెలవుపెట్టారు. ఆమె స్థానంలో తూర్పుగంగవరం పశువైద్యాధికారి వంశీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో సరైన సేవలు అందటంలేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముండ్లమూరు మండల ప్రజలు ఎక్కువగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఒక్క ముండ్లమూరు పశువైద్యశాల పరిధిలోనే 18వేల పశువులు ఉన్నాయి. ఈదర పశువైద్యశాల పరిధిలో తొమ్మిది వేలకుపైగా పశువులు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యతగల ఈరెండు పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కుకావటంతో సక్రమంగా సేవలు అందడంలేదని పశుపోషకులు పేర్కొంటున్నారు. ఒకే అధికారి రెండుచోట్ల బాధ్యతలు నిర్వహించటం వల్ల కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పశువులు వ్యాధులు భారిన పడినప్పుడు సకాలంలో వైద్యం అందక మృతి చెందిన సంఘనలు ఉన్నాయి.

ముండ్లమూరు పశువైద్యశాల పరిధిలో పశుపుగల్లు, సింగనపాలెం, ఉల్లగల్లు, కెల్లంపల్లి, పులిపాడు, వేముల, వేంపాడు, శంకరాపురం, పోలవరం గ్రామాలు ఉన్నాయి. ఈదర పశువైద్యశాల పరిధిలో భీమవరం, పూరిమెట్ల, బొప్పూడివారిపాలెం, కొమ్మవరం, అయోధ్యనగర్‌లు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా పశువైద్యాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులను నియమించాలని పశుపోషకులు కోరుతున్నారు.



స్వామివారికి మహానైవేద్యం తెస్తున్న భక్తులు

ఘనంగా ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి కుంకుమార్చన, విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదిక్షణ చేసి స్వామి వారికి మహానైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గోశాలలోని గోమాతలకు పసుపు కుంకుమతో హారతి ఇచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, పామూరు ఎస్ఐ టి.కిశోర్‌బాబు కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు రామయ్య

వీసీపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య అన్నారు. మండలంలోని పోతవరం, నేరేడుపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కేఎస్ఎస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. రామయ్య మాట్లాడుతూ కేఎస్ఎస్ సభ్యులు తమ పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తే ప్రజలు పార్టీకి మద్దతుగా నిలుస్తారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి పార్టీశ్రేణులందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెంపూడి వెంకట్(చిన్నా), కోమటిగుంట్ల వీరయ్య, పల్లా మల్లికార్జున, ముప్పూరి బ్రహ్మయ్య, చాగంరెడ్డి మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

ముండ్లమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పలురోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా రెడ్డినగర్ నుంచి బసవాపురం, శ్రీనివాస నగర్ మీదుగా వెళ్ళే ప్రధాన రహదారి గోతులమయమైంది. మూడు కిలోమీటర్లు ఉండే ఈ రహదారి దారుణంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యేక చొరవతో పంచాయతీ రహదారిని తారురోడ్డుగా నిర్మించేందుకు రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్పట్లో కొద్దిమేర రహదారిపై ఉన్న గోతులను పూడ్చి కంకరతోలి వదిలివేశారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో ఆరహదారిపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. శ్రీనివాసనగర్, బసవాపురం గ్రామస్థులు దర్శి, ముండ్లమూరు, అద్దంకి ప్రాంతాలకు వెళ్ళాలంటే ప్రయాణికులు పడుతున్న పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఈగోతుల్లో ద్విచక్ర వాహనాలు పడి వాహన చోదకులు గాయాలుపడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

వైభవంగా కలశ పూజ



కలశ పూజ చేస్తున్న భక్తులు

ముండ్లమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో శ్రీఅన్నపూర్ణ దేవి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఈనెల 15న జరగనుంది. ఈక్రమంలో ఆదివారం కలశ పూజ వైభవంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకంతో పాటు నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం శివాలయంలో కలశాలను ఉంచి పూజలు చేశారు. ఈసందర్భంగా కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు.

సమాచార హక్కు చట్టంతో ప్రజలకు మేలు

తాళ్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమాచారాన్ని నిర్భయంగా తెలుసుకునేందుకు ప్రవేశపెట్టిన సమాచార హక్కు చట్టంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం 20 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లూరులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టంతో పథకాల అమలులో ఉన్న లోటుపాట్లను గుర్తించే వీలు కలుగుతుందన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి సమాచార హక్కుచట్టం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, ఐ.శ్రీనివాసరెడ్డి, గ్రామకార్యదర్శులు షేక్ హనాజ్‌బేగం, శేషమ్మ, క్రిష్ణ, డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.కాగా, ఈకార్యక్రమానికి మండల స్థాయిఅధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఏపీవో తదితరులు ఈకార్యక్రమానికి హాజరుకాలేదు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

పామూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని ఒంగోలు మెడిక్యూర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని డాక్టర్ గద్దె ఏడుకొండలు అశ్వని హాస్పిటల్‌లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలోపడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మానవుని అవయవాలలో అతి ముఖ్యమైన గుండె కీలకమన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులను నివారించుకోవచ్చునని చెప్పారు. డాక్టర్ గద్దె ఏడుకొండలు మాట్లాడుతూ అశ్వని వైద్యశాలలో ప్రతినెలా మూడవ ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీధర్‌బాబు



ఆదాయం.. అదరహో

మున్సిపాల్టీల ఆదాయం పెరిగింది. పన్నులు పెంచకుండా ఆదాయం పెంచుకోవాలని మున్సిపాల్టీలను ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపాల్టీలు స్వయంగా ఆర్థిక ప్రతిపత్తిని సాధించాలని, నిధుల కోసం ప్రభుత్వం వైపు చూడకుండా వనరులు పెంచుకునే దిశగా, ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇంటింటి పన్నుల పరిశీలన చేపట్టారు. దీంతో ఇప్పటి వరకు పన్నులు వేయని ఆస్తులు, తక్కువ మొత్తంలో పన్నులు చెల్లిస్తున్న ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇంటింటి సర్వేతో ఇబ్బడిముబ్బడిగా పన్నుల ఆదాయం పెరిగింది. ఇప్పటి వరకు జరిగిన సర్వే పునః పరిశీలనకు ఇతర మున్సిపాల్టీల నుంచి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయనున్నారు. పన్నుల్లో అక్రమాలకు చెక్ పెట్టి తద్వారా మున్సిపాల్టీల ఆదాయాలను పెంచుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

- పురాల్లో పెరిగిన ఆస్తి పన్నులు
- ఇంటింటి సర్వేలో పన్ను వేయని ఆస్తుల గుర్తింపు
- మూడు జిల్లాల్లో పెరిగిన వార్షిక ఆదాయం రూ.28.02 కోట్లు

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆదేశాలతో పురపాలకులు ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ప్రధాన ఆదాయాల్లో కీలకమైన ఆస్తి పన్నులపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఆస్తి పన్నుకు సంబంధించి సమగ్ర పరిశీలన చేపట్టారు. దీంతో ఇంటింటి సర్వే చేపట్టారు. మున్సిపాల్టీల్లో ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. చేజారిన పన్నుల ఆదాయాలను చేజిక్కించుకుంటున్నాయి. పురాల్లో ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వే గడువు ఈ నెల 10న ముగిసింది. ఇప్పటికి 75 శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో సర్వేను కొనసాగించాలని ఆర్డీ హరికృష్ణ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు సర్వే చేసిన ఆస్తులకు సంబంధించి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల వార్షిక ఆదాయం రూ.28.02 కోట్లు పెరిగింది.

సర్వేతో అక్రమాలకు చెక్

వైసీపీ హయాంలో అధికారం అండతో ఇళ్లు.. వ్యాపార, వాణిజ్య సముదాయాలకు తక్కువగా పన్ను విధింపు జరిగినట్లు సర్వే ద్వారా అధికారులు నిర్ధారించారు. పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు తేలింది. పన్నుల విధానాన్ని గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ చేసింది. అయితే కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేయడంతో పన్ను తక్కువగా నమోదైనట్లు ఇంటింటి సర్వేలో గుర్తించారు. అలాగే ఇంటి కోసం నిర్మించిన భవనాన్ని వ్యాపార.. వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు భవనంపై కట్టడాలు వంటివి కూడా చోటు చేసుకున్నట్లు తేలింది. ఈ అక్రమాలను సర్వేలో గుర్తించి పన్ను విధించారు. దీంతో పలు మున్సిపాల్టీల్లో ఆదాయం గణనీయంగా పెరిగింది.

సర్వేతో పెరిగిన ఆదాయం (రూ.లక్షల్లో)

గుంటూరు జిల్లా	
గుంటూరు	460
మంగళగిరి	397
తెనాలి	84
పొన్నూరు	31
వినుకొండ	36
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	89
దాచేపల్లి	7
సత్తెనపల్లి	29
పిడుగురాళ్ల	26
మాచర్ల	36
గురజాల	12
బాపట్ల జిల్లా	
బాపట్ల	87
అద్దంకి	20
చీరాల	52
రేపల్లె	35



అమరావతి నుంచే..



ఇక సీఆర్‌డీఏ పాలన

- సర్వహంగులతో సిద్ధమైన ప్రధాన కార్యాలయం
- నేడు రాయపూడిలో సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం
- అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ
- రాజధానిలో అందుబాటులోకి ప్రభుత్వ తొలి శాశ్వత పాలనా భవనం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో పాలనా సౌలభ్యం కొరకు సర్వహంగులతో సిద్ధమైన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. రాజధాని అమరావతిని ప్రతిబింబించేలా 'ఏ' అక్షరం ఎలివేషన్‌తో అత్యద్భుతంగా సీఆర్‌డీఏ కార్యాలయాన్ని నిర్మించారు. విజయవాడ కేంద్రంగా సాగిన సీఆర్‌డీఏ కార్యకలాపాలు ఇక నుంచి రాయపూడిలో నూతనంగా నిర్మించిన ప్రధాన కార్యాలయం నుంచి సాగనున్నాయి. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా అమరావతి కేంద్రంగా పరిపాలన ప్రారంభం కా నున్నది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ సహా మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో పనిచేయాల్సిన అన్ని విభాగాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. రాజధాని రైతులు సమస్యలకు సంబంధించి ఇప్పటి వరకు విజయవాడ రావాల్సి వచ్చేది. ఇక మీదట తమ స్థానిక ప్రాంతంలోనే కార్యాలయం ఉండటం (మిగతా 7వ పేజీలో)





మున్సిపల్ శాఖ హెచ్ఓడీల భవనాలలో ఓ భవనం



సీఆర్‌డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

విద్యారంగ పునరుజ్జీవానికి కూటమి నాంది

నూతన ఉపాధ్యాయుల అభినందన సభలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా రంగ పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మెగా డీఎస్సీలో నియోజకవర్గ పరిధిలో ఎంపికైన 60 మందికి వేమూరులోని రోశయ్య మీటింగ్ హాలులో ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలన్న దృష్టితోనే మెగా డీఎస్సీని నిర్వహించినట్లు తెలిపారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం యువత భవిష్యత్‌తో ఆటలాడుకుందని విమర్శించారు. విద్యా రంగంలో ఏపీ దేశంలోనే మూడో స్థానం నుంచి 19వ స్థానానికి దిగజారడానికి జగన్ ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటి వరకు 1,96,619 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో అధిక భాగం చంద్రబాబు పాలనలోనే ఉద్యోగాలు పొందిన వారున్నారు. కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులకు నూతన ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, సొసైటీ అధ్యక్షుడు ఉసా రాజేష్, నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, యార్డు వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిశోర్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, శేషబాబు, శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ఆనందబాబు

ఈత సరదా.. విషాదం

- ముగ్గురు మృతి.. ఇద్దరు గల్లంతు
- వాడరేవు తీరంలో వేర్వేరు ఘటనలు
- తెలంగాణ వాసులు ముగ్గురు.. చీరాలవాసులు ఇద్దరు
- గాలింపు చర్యలు పర్యవేక్షించిన ఎస్పీ ఉమామహేశ్వర్

చీరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదివారం.. వాడరేవు సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వేర్వేరుగా వచ్చిన ఐదుగురు విద్యార్థుల కుటుంబాల్లో విషాదం అలుముకుంది. అలల తాకిడికి ముగ్గురు విద్యార్థులు విగతజీవులుగా ఒడ్డుకు చేరగా, మరో ఇద్దరి గల్లంతయ్యారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాయి మణిదీప్(20), శ్రీసాకేత్(20), జీవన్ సాత్విక్(20) అమరావతి విట్ కళాశాలలో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మరో నలుగురు మిత్రులతో కలిసి వాడరేవులో ఈతకొడుతూ సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అయితే మణిదీప్ కాస్తంత లోతుకు వెళ్లి ఈత కొడుతుండగా అతడ్ని బయటకు తెచ్చేందుకు ఇద్దరు మిత్రులు వెళ్లారు. ఒక్కసారిగా అలల తాకిడి పెరగడంతో మణిదీప్ గల్లంతయ్యాడు. అతడ్ని రక్షించే క్రమంలో వెళ్లిన శ్రీసాకేత్, సాత్విక్ గల్లంతయ్యారు. విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిన గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టారు. ఇదే సమయంలో వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన కుంచన షారోన్, గౌతమ్ ఈత కొడుతూ అలల తాకిడికి గల్లంతయ్యారు. దీంతో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు ఐదుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కొద్దిసేపటికే ముగ్గురి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. కాగా వడ్డె సంఘానికి చెందిన ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. షారోన్ రాజమండ్రిలో బీటెక్ చదువుతుండగా, గౌతమ్(పండు) కొత్తపేట హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ వాడరేవు సముద్రతీరానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

తీరంలో ఘోరం.. ఎమ్మెల్యే కొండయ్య

తీరంలో జరిగిన ఘోర ప్రమాదం తన హృదయాన్ని కలచి వేసిందని ఎమ్మెల్యే కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఘటనపై కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

సత్వరం సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉద్యమబాట పట్టకముందే ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం జరిగిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమా వేశంలో ఆయన మాట్లాడారు.బకాయిలు కోసం ఎదురు చూస్తూనే చాలా మంది విశ్రాంత ఉద్యోగులు చనిపోతున్నా రని తెలిపారు. చట్టబద్ధంగా నియమించాల్సిన పీఆర్సీ కమిటీ, డీఏలు, బకాయిలతో పాటు ఐఆర్ ఇవ్వకుండా ఉద్యోగులను బాధపెట్టడం సరికాదన్నారు. ఉద్యోగులు ఇష్టంతో ఎన్నుకున్న ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాలుగోతరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కూడా కార్యవర్గాలను ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, జిల్లా అధ్యక్షుడు కొండయ్య, ఏపీజేఏసి అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు, రాష్ట్ర మహిళా కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, నగర జేఏసీ ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ అసోషియేషన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు పీఏ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఈ-క్రాప్ గడువు పెంపు

- నత్తనడకన పంట నమోదు
- 25 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు
- వెబ్‌ల్యాండ్‌లో భూమి మొత్తం ఈ-క్రాప్‌లోకి..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇన్‌పుట్ సబ్సిడీ మొదలు, విత్తనాల రాయితీ వరకు రైతులకు ఈ-క్రాప్ ప్రామాణికం. ఈ-క్రాప్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కేవలం సాగులోని పైర్ల నమోదుకే పరిమితమైన ప్రక్రియ తొలిసారి వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూముల వివరాలన్నీ ఈ-క్రాప్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది.ఈ ప్రక్రియ పూర్తికి సెప్టెంబరు 30 వరకు తొలుత ప్రభుత్వం గడువు విధించింది. అయితే వ్యవసాయ భూమి నమోదు దాదాపుగా కొలిక్కి వచ్చినప్పటికీ, నిరుపయోగ భూముల వివరాల నిక్షిప్తం చేసే ప్రక్రియ నత్తనడకన సాగుతూఉంది. దీంతో ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగిస్తూ తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే దాదాపు మూడున్నర నెలలు దాటింది. కానీ సాగు విస్తీర్ణం అంచనాలకు, ప్రస్తుత సాగుకు భారీ వ్యత్యాసం కనబడుతోంది. ఈ-క్రాప్ నమోదులో సిబ్బంది అలసత్వం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ప్రస్తుత సాగులో ముంపు బారిన పడిన పైరులో కనీసం 15 శాతం కూడా గతంలో ఈ-క్రాప్ రికార్డుల్లో ఎక్కలేదు. అంటే వీరందరికీ అందే ఇన్‌పుట్ సబ్సిడీకి గండిపడినట్లే.

నమోదులో అనేక ప్రతిబంధకాలు..

గతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా రైతు చెప్పిన సాగు వివరాలతో ఈ-క్రాప్ నమోదును మమ అనిపించేవారు. దీని వల్ల ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు పొలంలో ఉన్న పంట ఒక్కటి ఉండగా రికార్డుల్లో మరో పంట దర్శనమిచ్చేది. దీంతో రైతులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోయేవి. ఇలాంటి తప్పిదాల కు ఆస్కారం లేకుండా ఈ-క్రాప్ నమోదు వంద శాతం కచ్చితత్వంతో జరగాలనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది. కానీ పక్కాగా వివరాల నమోదుకు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. సిబ్బంది కొరతతో ఫీల్డ్ విజిట్ కష్టసాధ్యంగా మారింది. దీనికి తోడు వైసీపీ వది లేసి వెళ్లిన రీసర్వే తప్పులు, రైతులు అందుబాటులో లేకపోవడం, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు తప్పుల తడకగా ఉండడం వంటివన్నీ ఈ-క్రాప్ నమోదుకు ప్రతిబంధకాలుగా ఉంటున్నాయి.



- అమృతలూరు మండల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

జిల్లాల వారీగా ఇలా..

బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం 2,71,322 ఎకరాలు కాగా, ఈ-క్రాప్‌లో నమోదైంది 2,34,432 ఎకరాలు. జిల్లాలో మొత్తం భూముల వివరాలను 9,34,451 ఎకరాలుగా తేల్చి ఆ రికార్డులను ఏవోల లాగిన్‌లకు ప్రభుత్వం పంపించింది. మొత్తం గా చూస్తే ఇప్పటి వరకు 4,11,490 ఎకరాలు మాత్రమే ఈ-పంటలోకి ఎక్కింది.

- గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 2,13,687 ఎకరాలు సాగు కాగా ఇందులో 1,97,360 ఎకరా లు ఈ-క్రాప్‌లో నమోదైంది. వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం 5,78,610 ఎకరాలు కాగా, 2,44,427 ఎకరాలకే ఈ-పంట పరిమితమైంది.

- పల్నాడు జిల్లాలో సాగు విస్తీర్ణం 4,23,026 ఎకరాలు. కాగా ఇందు లో ఇప్పటి వరకు 3,75,929 ఎకరాలే ఈ-పంట లోకి ఎక్కింది.

పేదలకు మెరుగైన వైద్యం కోసం సంస్కరణలు

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సంస్కరణలు తీసుకువస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెం దిన 124 మంది పలు రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకోగా, వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.69 లక్షల చెక్కులను మంత్రి చిలకలూరి పేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను వేగంగా పూర్తి చేసేందుకే పీపీపీ విధానం అమలు చేస్తుందన్నారు. పేద, మధ్య తర గతి ప్రజలకు వైద్యపరంగా ఆర్థికంగా ఇబ్బంది లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అంద జేస్తున్నామన్నారు.



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

గ్రానైట్ వ్యర్థాలతో నిండిన సనకొండ

● డంపింగ్ యార్డుల్లా మారుతున్న ప్రభుత్వ భూములు
● రోడ్డు సైతం కనుమరుగయ్యేలా వ్యర్థాలు పడేస్తున్నారని రైతుల ఆందోళన




సనకొండ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా పడేసిన గ్రానైట్ వ్యర్థాలు

బల్లికురవ, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న సనకొండ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములలో గ్రానైట్ ఫ్యాక్టరీల వ్యర్థాలను పెద్దఎత్తున పడవేస్తున్నారు. దీంతో కొండ ప్రాంతానికి వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు. రోడ్డును సైతం వ్యర్థాలతో నింపుతుండడంతో అది కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. బల్లికురవ మండలం గుంటుపల్లి, మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సనకొండ భూములలో కొందరు రెండు మండలాల్లో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి పెద్ద ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. దీంతో కొండ భూములు మొత్తం వ్యర్థాలకు నిలయంగా మారాయి. బల్లికురవ వైపు నుంచి కొండమీదగా మార్టూరు, నాగరాజుపల్లి వెళ్లే రోడ్లు సైతం వ్యర్థాలు నిండాయి. ఫ్యాక్టరీలలో పనికి రాని రాళ్లను రాత్రుళ్లు తీసుకు వచ్చి రోడ్ల వెంబడి, ప్రభుత్వ భూమిలో వేస్తున్నారని వీటి వలన పంట భూములకు వెళ్లే రైతులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దూర ప్రాంతాలలో ఫ్యాక్టరీలు నిర్వహించే వారు సైతం వాహనాలను పెట్టి మరి వ్యర్థాలను తీసుకు వచ్చి పడేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే నిఘా పెట్టి వ్యర్థాలను పడేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని లేకుంటే ముందు ముందు సనకొండ భూములు వ్యర్థాలకు చిరునామాగా మారుతుందని రైతులు పేర్కొంటున్నారు.

అవీ..ఇవీ..

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● సీఐ వైవీ రమణయ్య
● దీపావళి మందుల గోదాముల పరిశీలన



దీపావళి మందుల గోదామును తనిఖీ చేస్తున్న సీఐ రమణయ్య

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి దీపావళి మందులను నిల్వచేసే వారిపై చర్యలు తప్పవని ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.వీ.రమణయ్య హెచ్చరించారు. ఆదివారం సర్కిల్ పరిధిలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో పలు దీపావళి మందుల గోదాములను రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీ చేశారు. సంబంధిత పత్రాలు, స్టాక్ వివరాలను పరిశీలించారు. టపాసుల నిల్వ, భద్రతా ఏర్పాట్లు, అగ్ని మాపక పరికరాలు అందుబాటు తదితర అంశాలను నిశితంగా పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కారంచేడు ఏఎస్ఐ శేషసాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తోటవారిపాలెం (చీరాల), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 216లో గత సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నక్క రత్నబాబు(35) ఆదివారం రాత్రి గుంటూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒంగోలు నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారువేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ప్రమాదంలో గాయపడిన ఆయన అప్పటి నుండే వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా, అతనితో పాటు ద్విచక్ర వాహనంపై ఉన్న దానియేలు చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు వయవసాయ కూలీ కాగా ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్టూరు, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంకి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన ఇండస్ట్రియల్ ఫీడరు మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని జూనియర్ ఇంజనీర్ వి.కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఇసుకదర్శి, జొన్నతాళి, కోనంకి గ్రామాల పరిధిలోని పరిశ్రమలు, ఇతరత్రా విద్యుత్ నివాసగృహాలకు కోత ఉంటుందన్నారు.

రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌లో లక్ష్మీప్రియ ప్రతిభ



లక్ష్మీప్రియ

పంగులూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పంగులూరుకు చెందిన బాచిన లక్ష్మీప్రియ రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌లో ప్రతిభచాటి యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచారు. విజయవాడలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శుక్ర, శనివారాలలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రీసెర్చ్ స్కాలర్స్ మూడవ సమ్మిట్‌లో లక్ష్మీప్రియ పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో లక్ష్మీప్రియ ఎఐ, పవర్ టెలిమెడిసన్ ప్లాట్‌ఫామ్స్, హెల్త్‌కేర్ అంశాలను విశదీకరించారు. ఆమె ఇచ్చిన ప్రజంటేషన్ తీరును మెచుకున్న నిర్వాహకులు, యూనివర్శిటీ పరిధిలో ప్రథమురాలిగా గుర్తించి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించి అభినందించారు. పంగులూరు గ్రామానికి చెందిన లక్ష్మీప్రియ తండ్రి బాచిన వెంకటసుబ్బారావు ఆర్మీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. లక్ష్మీప్రియ ప్రస్తుతం విజయవాడలోని కేఎల్ యూనివర్శిటీలో కామర్స్‌లో మూడవ సంవత్సరం పీహెచ్‌డీ చేస్తూ ఈ ఎస్ఆర్ఎం. యూనివర్శిటీ నిర్వహించిన రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. రీసెర్చ్ స్కాలర్ సమ్మిట్‌లో పాల్గొని ప్రతిభచాటిన బాచిన లక్ష్మీప్రియను కేఎల్.యూనివర్శిటీ యాజమాన్యం ప్రశంసించగా పంగులూరుకు చెందిన పలువురు అభినందించారు.

గ్రానైట్ మైనింగ్ రాయల్టీ ఒప్పందం రద్దు చేయాలి : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ ప్రైవేటు సంస్థకు అప్పగించిన గ్రానైట్ మైనింగ్ రాయల్టీ ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రానైట్ పరిశ్రమలను తెరిపించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1నుంచి గ్రానైట్ మైనింగ్ రాయల్టీ వసూలును ఏఎం ఆర్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం తగదన్నారు. గతంలో రూ.27వేల రాయల్టీని ఒక్కసారిగా రూ.35వేలకు పెంచడం వల్ల పరిశ్రమలపై అధికభారం పడుతుందని, దీని ప్రభావం వల్ల ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులపై ఉంటుందని, వలస కూలీలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. జిల్లాలో 2500 ఫ్యాక్టరీల్లో 25వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీటిలో చీమకుర్తి పరిధిలోనే 1200 ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. బీహార్, ఒడిశా, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది వచ్చి ఉపాధి పొందుతున్నారన్నారు. అందువల్ల ప్రైవేటు సంస్థకు అప్పగించే విధానాలను ప్ర భుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

చీమకుర్తి సీఐ సుబ్బారావు దీర్ఘకాలిక సెలవు

● గెలాక్సీ టౌన్‌లో పోస్టు కోసం పోటాపోటీ

చీమకుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు ఆ దివారం నుంచి లాంగ్ లీవ్ తీసుకున్నారు. తన సతీమణి అనారోగ్య కారణాల నిమిత్తం ఆయన సెలవు పెట్టారు. దీంతో జిల్లాలోనే పోలీస్‌శాఖ లో అత్యంత విలువైన పోలీస్‌స్టేషన్ చీమకుర్తికి స్టేషన్‌హౌస్ ఆఫీసర్(సీఐ)గా రావడానికి పలువురు పావులు కదుపుతున్నారు. సీఐ పోస్టు కో సం రాజకీయ పైరవీలు మొదలయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొనే పనిలో పలు వురు సీఐలు నిమగ్నమయ్యారు. కీలకమైన స్టేషన్‌కు వెంటనే సీఐ పోస్టుని ఖాళీగా ఉంచరని భావించిన ఔత్సాహికులు తమ ప్రయ త్నాలను ముమ్మరం చేశారు. ఈ పోస్టు రేసులో శశికుమార్, మాకినేని శ్రీనివాసరావు, హజరత్తయ్య, దుర్గాప్రసాద్, పాండురంగారావు, సుబ్బారావు, అజయ్‌బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. కాగా చీమకుర్తి, ఒంగోలు రూరల్ సీఐ పోస్టులలో సామాజిక న్యాయం పాటించేలా కనపడుతుంది. ఈనేపథ్యంలో ఒకచోటు కమ్మ, మరోచోట ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సీఐలకు పోస్టింగ్ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్‌వర్గాల్లో ఈ రెండు పోస్టులు ఎవరికి దక్కుతాయే అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

త్రోవగుంటలో అమ్మవార్లకు పాలపొంగళ్లు

● భారీగా హాజరైన భక్తులు

ఒంగోలు(రూరల్), అ క్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుం టలో ఆదివారం గ్రామస్థులు అమ్మవార్లకు (గ్రామదేవత లకు) పాలపొంగళ్లు సమ ర్పించారు. గ్రామంలో మహి ళలు ఆదివారం ఉదయం శీ తాలమ్మకు (బొడ్డురాయి) చద్ది సమర్పించారు. సాయంత్రం అంకమ్మతల్లి, మహాలక్ష్మమ్మ, మారెమ్మ తల్లికి, రాత్రి 9గంటల తరువాత పోలేరమ్మతల్లికి పొంగళ్లు సమర్పించారు. ఈ సం దర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు భారీ ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చారు. పాడిపంటలు, పశుసంపద, ఆరోగ్యంగా ఉండాలంటూ గ్రామదేవతలను వేడుకున్నారు. సోమవారం పుట్లమ్మతల్లి, మరెడమ్మతల్లి, అట్లమ్మతల్లికి పాలపొంగళ్లు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిటెక్‌గ్రీన్‌స్పార్క్ సంయుక్తంగా ఆదివారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషమైన స్పందన లభించింది. శంకర కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు సిబ్బంది రోగులకు కంటి పరీక్షలతో పాటు, షుగర్, బీపీ, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి మండలం నుండి 505 మంది హాజరుకాగా, వారిలో 215 మందిని శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. వారందరికీ ట్రస్ట్ తరఫున ఉచితంగా శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తారని ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అదేవిదంగా శిబిరానికి వచ్చిన వారందరికీ ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిదులు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చి త్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో లక్షమందికి కంటి ఆపరేషన్లు చేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబ శి వరావు ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రాజకీయాలకు అతీతం గా ఉచిత కంటి వైద్యశిబిరాలను ఏర్పాటుచేస్తూ, ఎంతో మందికి కంటిచూపు వచ్చేవిధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రావిపాటి సీతయ్యగుదే తారకరామారావు, దూళ్లిపాళ్ల వెంకటస్వామి, నెహమ్యారావు, సర్పంచ్ రేణుక బాల కోటేశ్వరరావు, గోరంట్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న బాబురావు

చీరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియంలో 29వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా జూనియర్ బాలబాలికల పోటీలు ముగిశాయి. 17 జిల్లాల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఆదివారం విజేతలకు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు డా.ఐ బాబురావు, ఉపాధ్యక్షుడు సుభాషిణి హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నరసారావుపేట ఎంఎం.కళాశాల చైర్మన్, ఆల్ ఇండియా బహుజన సమాజ్‌పార్టీ సమన్వయకర్త బి.పరంజ్యోతి, గజవల్లి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టావారిపాలెంలో సోలార్ సేవలు ప్రారంభం



సోలార్ పవర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

సంతమాగులూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) ఇంధన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో భావితరాలకు సోలార్ ఎనర్జీ అన్ని రంగాలలో ప్రాముఖ్యం కానుందని, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్ అన్నారు. సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెంలో సన్ లైట్ సోలార్ ఎనర్జీ టెక్నాలజీ కార్యాలయాన్ని టీడీపీ మండల నాయకులు చెవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, ఏల్చూరు వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు నారదాసు శ్రీను బాబులతో కలసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇంధన వ్యయం దినదినం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు సోలార్ ఎనర్జీ మీదనే ఆధార పడిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నాయని తెలిపారు. సూర్య ఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సోలార్ వెలుగులు నింపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతి ఇంటికి రూపాయి ఖర్చు లేని సోలార్ ఎనర్జీకి ప్రోత్సహించేందుకు రాయితీ అందజేస్తున్నట్లు తెలిపారు. పుట్టవారిపాలెంలో ఏర్పాటు చేసిన సన్‌లైట్ సోలార్ ఎనర్జీ టెక్నాలజీస్ కార్యాలయం ద్వారా సంతమాగులూరు మండలంతో పాటు పరిసర మండలాల కూడా సోలార్ ఎనర్జీ సేవలు విస్తరించనున్నాయని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. . మండలంలోని మామిళ్లపల్లి కుందుర్రు బల్లికురవ మండలం రామాంజనేయపురం పరిసర గ్రామాల పరిధిలో 1500 ఎకరాల విస్తీర్ణంలో దేశంలో మరెక్కడా లేనివిధంగా సోలార్ పరికరాల ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లుల భారం నుండి ఉపశమనం పొందాలని వారు తెలిపారు. ఒక్కో ఇంటి సోలార్ ఎనర్జీ కనెక్షన్ కోసం రూ.60 వేల నుంచి రూ.78 వేల వరకు ప్రభుత్వం రాయితీ అందజేస్తోందన్నారు. పుట్టవారిపాలెం కేంద్రంగా ఏర్పాటు అయిన సన్‌లైట్ సోలార్ ఎనర్జీ టెక్నాలజీస్ కార్యాలయం ద్వారా ఒక కిలో వాట్ నుండి మెగా కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేయగల పరికరాల అమర్చే సామర్థ్యం ఉన్న సంస్థ అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

పూర్వజన్మ సుకృతంతోనే శ్రీశైలం గాయత్రీ పీఠాధిపతిగా బాధ్యతలు



సమావేశంలో రామారావును సత్కరిస్తున్న స్థానికులు

వేటపాలెం (చీరాల), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల పీఠాధిపతిగా వచ్చే జనవరిలో బాధ్యతలు చేపట్టనుండడం తన పూర్వజన్మ సుక్రుతమని వేటపాలెం మండలం రావూరిపేటకు చెందిన చల్లా రామారావు అన్నారు. ఆదివారం గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. పీఠం ఉత్తరాధికారిగా కారుపర్తి తేజేశ్వరశర్మ నియమితులయినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకటేష్, లక్ష్మణరావు, మహదేవమూర్తి, శంకరరావు, బ్రహ్మం, రవిబాబు, రాహుల్, బాబు, బట్టా మోహన్‌రావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సేవతో ఆనందం



ఆత్మీయ సమావేశంలో ప్రతినిధులు

చీరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులకు సేవలతో మానసిక ఉల్లాసం, ఆనందం ఉంటుందని బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజ్ 1979-82 పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం రామాపురంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం నిర్వహించారు. వారు సేవల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, టీఎస్ఎన్ మూర్తి, శరత్, రమేష్ పాల్గొన్నారు.

నీటి సంపులో పడి ఎలక్ట్రీషియన్ మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కార్పొరేషన్ నీటి సంపులో ప్రమాదవశాత్తు జారి పడి ఎలక్ట్రీషియన్ సుతారం శ్రీనివాస్ (32) మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని బాలాజీరావు పేట వద్ద ఉన్న నీటి సంపు వద్ద జరిగింది. చెరువుకొమ్ముపాలెంనకు చెందిన శ్రీనివాస్, కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ బేసిక్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటల వరకు అక్కడే విధులు నిర్వహించా డు. ఆ తరువాత ఫోన్ చేసినా తీయలేదని ఆయన తల్లి సీతారావమ్మ చెబు తుంది. ప్రమాదావశాత్తు తన నకుమారుడు సంపులోపడి ఉంటాడని పేర్కొన్నా రు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తినైపుణ్య శిక్షణకు కార్పెంటర్లకు అవకాశం

అద్దంకిటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కార్పెంటర్లుకు డిజైనింగ్, కట్‌లిస్ట్, పానల్ సా, ఎడ్జ్ బెండింగ్, మల్టీ బోరింగ్ మిషన్ ఆపరేటింగ్‌పై 75 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇ వ్వడం జరుగుతుందని ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెన్నుపల్లి శ్రీనివాసచారి, కుందుర్తి సీతారామాంజనేయుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రిలో ఈ నెల 20 నుంచి మూడవ బ్యాచ్ ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి కలిగిన 18 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగిన కార్పెంటర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూములను విడిపించండి

మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన కాకానిపాలెం వాసులు




మేదరమెట్లలో ర్యాలీలో పాల్గొన్న రవికుమార్, అద్దంకిలో సమస్యలు వింటూ..

అద్దంకి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలు నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయ, విక్రయాలకు ఇబ్బందిగా మారి రిజిస్ట్రేషన్లు నిలుస్తున్నాయని పలువురు ప్రజలు వాపోయారు. సమస్యను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోవడంతో త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రవిమకుమార్‌కు పలువురు అర్జీలను ఇచ్చారు. 3వ వార్డులో కొత్తగా సెల్ టవర్ ఏర్పాటుకు సిద్ధమౌతున్నారని, నిలుపుదల చేయించాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వేరే ప్రాంతంలో ఖాళీగా ఉన్న పొలాలు కౌలుకు తీసుకొని ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ రవీంద్రను ఆదేశించారు. అనంతరం మండలంలోని వెంపరాలలో ఇటీవల కొండ్రగుంట హనుమంతరావు భార్య అనంతలక్ష్మి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందగా కుటుంబసభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. కమిషనర్ రవీంద్ర, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మంత్రి రవికుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. వెంపరాలలో విషజ్వరాలు విజృంభించిన నేపథ్యంలో గత 13 రోజులుగా వైద్యశిబిరాలు, పారిశుధ్య పనులు చేపడుతున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది మంత్రి రవికుమార్‌కు వివరించారు. శాంతినగర్-షైలవరం రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రైన్లు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

సంతమాగులూరు : పేదల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు మరింత మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న 25 మంది బాధితులకు హాస్పటల్ ఖర్చులు నిమిత్తం సంతమాగులూరు మండలానికి చెందిన 25 మందికి ఆదివారం తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను చెక్కులను అందజేశారు.

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి గ్రామంలో ఆదివారం రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్న బోడపాటి సుబ్బారావు ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. అంతకుముందు పెంట్యాల శ్రీరామమూర్తి ఇంటికి వెళ్లి, ఇటీవల వివాహం జరిగిన శ్రీరామమూర్తి మనుమరాలు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వెంట మాజీ ఎంపిపి గొట్టిపాటి రాంబాబు, గొట్టిపాటి వెంకటరావు,ముద్దనవెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రచారరథం ఉపయోగకరం

మేదరమెట్ల : ఆరోగ్య ప్రచార రథంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పి.గుడిపాడులో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పీడీ బీవీ సాగర్ ఆగస్టు 12 నుంచి అక్టోబరు 30 వరకు జరిగే ఐఈసీ అవగాహన కార్యక్రమాల గురించి రవికుమార్‌కు వివరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల నివారణకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని మంత్రి రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో అద్దంకి ఏఎంసీ చైర్మన్ వరగాని పద్మావతి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, గ్రామస్థులు, హెల్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

చినగంజాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో ఈ నెల 15న ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షులు ఆసోది అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఉచిత వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్లు, నరములు, దంతములు, కంటి వ్యాధుల వైద్య నిపుణులు, గర్భాశయ వ్యాధి, చర్మవాదుల, సాధారణ వ్యాధుల నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమీప గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రఫీ కోరారు.

సమాజంలో మార్పే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

● సంఘం శతజయంతి కార్యక్రమంలో శంకరనారాయణ

చినగంజాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : పంచ పరివర్తన ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని జిల్లా కార్యకారి కోట శంకరనారాయణ అన్నారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం(ఆర్.ఎస్.ఎస్) వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం శతజయంతి, విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మట్లాడుతూ గడప గడపకు ఆర్ఎస్ఎస్ సందేశం చేరాలని అన్నారు. సమాజం మారితే దేశం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో చీరాల ఖండ ప్రచారక్ శ్రీరామ్‌మాధవ్, ఈ.ఎస్.ఎఫ్ మండల ప్రచారక్ దండుప్రోలు వెంకటరావు, షేక్ జిలాని, వెంకటేశ్వర్లు, ఉలిచి ఏసుబాబు, ఎం.నటరాజ్, నూనె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త టీచర్లు

- ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు
- పాఠశాలల్లో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం (నేటి) నుంచి కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ పూర్తిచేసింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు రెండురోజులపాటు నియామక పత్రాలను ఆన్‌లైన్‌లో అందచేశారు.



ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయడంతో ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అయ్యేలా పాఠశాలలన్నీ కోలాహలంగా మారనున్నాయి. కొత్త అయ్యోర్లు పాఠశాలలకు రానుండడంతో వారిని జాయినింగ్ చేసుకునేలా సర్వం సిద్ధం చేశారు.

● నేడు విధుల్లో చేరిక

మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి పదిరోజులపాటు ప్రత్యేకశిక్షణ అందించి నియామక పత్రాలు అందచేశారు. జిల్లాలో విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలల్లో వీరిని నియమించారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలల్లో కలిపి మొత్తం 651 పోస్టులను భర్తీ చేశారు. వీటిలో ప్రభుత్వ జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగం ఇంగ్లిష్ 82, హిందీ 17, తెలుగు 29, ఉర్దూ 4, బయాలజీ 62, మ్యాథ్స్ 62, ఫిజికల్ డైరెక్టర్‌లు 103, ఫిజికల్ సైన్స్ 74, సోషల్ 101 పోస్టులు భర్తీ అయ్యాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 85 పోస్టులు కలిపి మొత్తం 619 భర్తీ అయ్యాయి. వీటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్‌ఏ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, తెలుగు 1, ఉర్దూ 1 పోస్టులు, ఎస్‌జీటీ తెలుగు 13, ఉర్దూ 4 కలిపి 20 పోస్టులు, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఎస్‌ఏ విభాగంలో మ్యాథ్స్ 1, ఫిజికల్ డైరెక్టర్ 1, ఫిజికల్ సైన్స్ 1, ఎస్‌జీటీ తెలుగు 9 కలిపి మొత్తం 12 పోస్టులు భర్తీ చేశారు. మొత్తం మీద ప్రభుత్వ, జడ్పీపీ, ఎంపీపీ పాఠశాలల్లో 619 పోస్టులు, కార్పొరేషన్ పాఠశాలల్లో 20, మున్సిపాలిటీ పాఠశాలల్లో 12 కలిపి మొత్తం 651 మంది కొత్త టీచర్లు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి : డీఈవో బాలాజీరావు



పాఠశాలల్లో కొత్తగా చేరుతున్న ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలి. సోమవారం పాఠశాలల్లో చేరిన వెంటనే ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులు వెంటనే రిలీవ్ కావాలి. మంగళవారం నాటికి వారు బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేరిన పాఠశాలల్లో రిలీవ్ చేయని వారిని కూడా వెంటనే రిలీవ్ చేసేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలి. కొత్తగా చేరిన టీచర్ల రిపోర్ట్ తేదీని పాఠశాల రికార్డుల్లో నమోదు చేసి వారి అర్హత సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. పత్రాలు సరిగాలేని వారి వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియచేయాలి.

మాట చెప్పడమేనా..?

- అమలు తీరును పట్టించుకోరా...
- నత్తనడకన ఎన్‌హెచ్ ఫ్లైవోవర్ల నిర్మాణం
- సెప్టెంబరుకు పూర్తి చేస్తామన్న గడ్కరీ
- కానీ ఇప్పటికీ పూర్తికాని వైనం
- గడువు పెంచినా కదలని కాంట్రాక్టరు
- ట్రాఫిక్‌జామ్‌తో ప్రజల అవస్థలు

నెల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'జాతీయ రహదారి(ఎన్‌హెచ్)-16పై నెల్లూరు నగరంలోని బుజబుజనెల్లూరు, గొలగమూడి వద్ద నిర్మిస్తున్న రెండు ఫ్లైవోవర్లను 2025 సెప్టెంబరు 11 లోపు పూర్తి చేస్తాం'.. ఇదీ గతేడాది పార్లమెంటులో కేంద్ర రహదారులశాఖమంత్రి నితిన్ గడ్కరీ చెప్పిన మాట. అయితే ఆయన చెప్పిన గడువు ముగిసింది కానీ, ఫ్లైవోవర్లు మాత్రం పూర్తికాలేదు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే ఫ్లైవోవర్లు పూర్తవడానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదో పనులు జరుగుతున్నాయని చెప్పడానికే తప్ప.. పనుల్లో వేగం కనిపించడం లేదు. ఏడాది క్రితమే ఈ వంతెనల పనులు పూర్తవ్వాల్సి ఉన్నా, వివిధ కారణాలతో జాప్యం జరిగింది. పోనీ పనులు ప్రారంభమైన తర్వాతైన వేగం పుంజుకున్నాయా.. అంటే అదీలేదు.

మొత్తం ఫ్లైవోవర్ అటుంచితే కనీసం అటు, ఇటు వెళ్లడానికి వీలుగా బాక్స్‌టైపు బ్రిడ్జిలను కూడా పూర్తి చేయలేకపోయారు. దీంతో వాహనదారులు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. సాధారణంగా జాతీయ రహదారులపై పనులు వేగంగా పూర్తి చేస్తుంటారు. కానీ ఆ పరిస్థితి నెల్లూరులో కనిపించడం లేదు.



నెల్లూరు నగరంలోని బుజబుజనెల్లూరు వద్ద జాతీయ రహదారిపై సాగుతున్న ఫ్లైవోవర్ పనులు

పనుల్లో కనిపించని వేగం

2022లో కేంద్ర ప్రభుత్వం రూ.85 కోట్ల అంచనాలతో బుజబుజనెల్లూరు వద్ద కిలోమీటర్ మేర ఓ ఫ్లైవోవర్, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద కిలోమీటర్ మేర మరో ఫ్లైవోవర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఆ వెంటనే టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. టెండర్ నిబంధనల ప్రకారం గతేడాదికే ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ భూసేకరణ సమస్యతో కొన్ని నెలలు పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు భూసేకరణను పూర్తి చేశారు. అనంతరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ క్రమంలోనూ కొంతకాలం పనులు ఆలస్యమయ్యాయి. పనులు ఆలస్యంగా జరగడంపై అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో గతేడాది పనులు మొదలుపెట్టించారు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేశారు. అయితే పనులు మొదలైనప్పటి నుంచీ ఆశించినంత వేగంగా జరగడం లేదు. గతేడాది చివరికే పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ అలా జరగకపోవడంతో కాంట్రాక్టర్‌కు ఈవోటీ(గడువు పొడిగింపు) ఇచ్చారు. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబరు నాటికి బ్రిడ్జిలు పూర్తి కావాల్సి ఉంది. గతేడాది డిసెంబరులో పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు.

అటు ట్రాఫిక్.. ఇటు దుమ్ము

నెల్లూరులోకి రాకపోకలు సాగించాలంటే బుజబుజనెల్లూరు, గొలగమూడి జంక్షన్‌లు కీలకం. నెల్లూరు నగరం విస్తరిస్తున్న కొద్దీ ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అక్కడ ఫ్లైవోవర్లు నిర్మించాలని నిర్ణయించింది. అయితే బ్రిడ్జిల నిర్మాణం పేరుతో డైవర్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా దూరం పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. అదే సమయంలో బ్రిడ్జిల నిర్మాణానికి ఫ్లైయాష్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది గాలికి దుమ్ముగా రేగుతుండడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇక్కడ కూడా నిర్మాణదారులు సరైన నివారణ చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఎంత త్వరగా ఈ బ్రిడ్జిలను పూర్తి చేస్తే అంత త్వరగా ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయి.

సెలవురోజున తరగతులు

- విద్యాశాఖ తనిఖీలు
- విద్యార్థులను ఇళ్లకు పంపిన అధికారులు
- ఇక ప్రతీ వారం తనిఖీలు : ఎంఈవో



కావలిలో ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న ప్రముఖ ప్రైవేట్ పాఠశాల నుంచి విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఎంఈవో గోవిందయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఆదివారం అయినా కూడా నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నాయి. దీంతో డీఈవో ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో క్లాసులు జరుగు తుండటాన్ని గమనించి, విద్యార్థులకు ఇళ్లకు పంపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'సెలవులైనా క్లాసులే' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో డీఈవో స్పందించారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కావలి ఎంఈవోకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆదివారం ఎంఈవో గోవిందయ్య కావలి పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు తరగతి గదుల్లో ఉండటంతో పాఠశాల యాజమాన్యంతో మాట్లాడారు. సెలవుల్లో తరగతులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపి, పాఠశాలలను మూయించారు. ఇక నుంచి ప్రతి ఆదివారం పాఠశాలలను తనిఖీలు చేస్తామని, తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగసముద్రంలో రియల్ భూం

లింగసముద్రం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైన ప్రస్తుత తరుణంలో లింగసముద్రంలో అమాంతం పెరిగింది. దీంతో మండలంలో రియల్ భూమ్ నెలకొంది. గ్రామ నడిబొడ్డులో ఉన్న ఓ స్థలంలో ఆ స్థలం యజమాని ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టగా హాట్‌కేకులుగా అమ్ముడయ్యాయి. సెంటు స్థలం ధర సుమారు రూ.15 లక్షలు పలికింది. దీంతో రియల్ ఎస్టేటు వ్యాపారులు, గ్రామ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో కూడా గజం స్థలం ధర రూ.30 వేలు ఉండదని రియల్ వ్యాపారులు చెబుతున్నారు.

జలదంకి-తెల్లపాడు రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం

- వివరాలు 7వ పేజీలో..

రేపు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఈనెల 14న (మంగళవారం) ఉదయం 9 గంటలకు 'క్వాంటర్ ఏజ్ బిగిన్స్-పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈవో బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. సెమినార్‌లో ఇవ్వబడిన అంశంపై రాతపరీక్ష, ప్రజంటేషన్, క్విజ్ సాధనాల ద్వారా న్యాయనిర్ణేతలు విద్యార్థులను పరీక్షించి విజేతలను ఎంపిక చేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థి 5 చార్ట్స్, స్లైడ్స్ ఉపయోగించి గరిష్ఠంగా ఆరు నిమిషాలు ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అనుమతి ఉందన్నారు. ఈ సెమినార్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని డీఈవో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 15న విజయవాడలో జరిగే పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో విజేతలు బెంగళూరులో ఈనెల 30న జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జిల్లా సైన్స్ అధికారి శివారెడ్డిని సంప్రదించి, సోమవారం (నేటి) సాయంత్రంలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పీఎం బందోబస్తుకు జిల్లా పోలీసులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలు జిల్లాలో జీఎస్టీ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబునాయుడు రానున్నారు. వారి బందోబస్తు కోసం జిల్లా పోలీసులు ఆదివారం తరలివెళ్లారు. జిల్లా నుంచి 250 మంది పోలీసులు కర్నూలు వెళ్లగా, శ్రీశైలానికి 60 మంది వెళ్లారు. మొత్తం జిల్లా నుంచి 310మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు.

ప్రభుత్వం మారినా... మారని అధికారుల తీరు



ఉదయగిరి ఆరోగ్య కేంద్రంలో జగన్ ఫొటోతో ఉన్న పోస్టర్

- వివరాలు 7లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.11731
వెండి కిలో ధర	రూ. 1,67,100
వెండి ఒక గ్రాము	రూ.175.00

సక్షమ్ ఆధ్వర్యంలో నేత్రదానం

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో చిరువ్యాపారి కనమర్లపూడి శేషగిరిరావు(78) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా ఆయన రెండు నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ వైద్యులు ఆయన నేత్రాలను సేకరించారు.

ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు

● టీడీపీ నేతల ధ్వజం


ఉదయగిరి: విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని టీడీపీ మండల కన్వీనర్ చింతన బోయిన బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభి వృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ మేక పాటి రాజగోపాల్‌రెడ్డిలు విమర్శించడం సిగ్గు చేటన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవు తుంటే వైసీపీ నాయకులు అవాకులు, చవా కులు పేలడం సరికాదన్నారు. ప్రజలే వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, అనంతశెట్టి ఏడుకొండలు, నల్లిపోగు నరసింహ, మట్ల రామయ్య, లక్ష్మయ్య, ఉప్పుటూరి పెదవెంకటయ్య, గాజుల బాబు, నవాజ్, దారపనేని నారాయణ, బొజ్జా నరసింహారావు, ఖాన్‌షా, సుబ్బారెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ భయపడే పార్టీ కాదు

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): అధికారం కోల్పోయి గ్రామాల్లో మనుగడ కోసం వైసీపీ నాయకులు ఆరాచకాలు సృష్టించేందుకు ఎన్ని ఎత్తులు వేసినా టీడీపీ భయపడే పార్టీ కాదని మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన హయాంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని ఎంతమేర అభివృద్ధి చేశారో గుర్తుంచుకోవాలన్నారు. తన ప్రాంతాల్లో అభివృద్ధి మరిచి మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వివాదాలు సృష్టించాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, ఎమ్మెల్యే కాకర్లను విమర్శిస్తే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, వైస్ ఎంపీపీ డీ.మధు, నక్కలగండి చైర్మన్ వేమూరి మధు, జనసేన పార్టీ మండల కన్వీనర్ పఠాన్ రసూల్, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, ముజ్జే లక్ష్మీనారాయణ, పోకా మహేశ్వరరావు, చంద్ర వెంకయ్య, ఆంద్రా నాగిరెడ్డి, ఆవుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మాలేపాటికి నాయకుల పరామర్శ


మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

కావలి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌స్ట్రోక్‌తో శస్త్రచికిత్స చేయించుకుని తాడేపల్లిలోని మణిపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడిని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. రాజ్యసభసభ్యులు బీద మస్తాన్‌రావు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావులు మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమెరికా నుంచి మాలేపాటి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఓగూరు సర్పంచి యనమద్రి సుబ్బారావు

కందుకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఓగూరులో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ. 20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్ భవనాన్ని ప్రారంభించి రూ. 10 లక్షల పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో గ్రామంలోని యువకులు, మహిళలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓగూరు గ్రామాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కందుకూరు మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు 22 కోట్ల రూపాయల జేఎంఎం నిధులు మంజూరు చేయగా టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

టీడీపీలో చేరిన ఓగూరు సర్పంచి

ఓగూరు గ్రామసర్పంచి యనమద్రి సుబ్బారావు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన వెంట టీడీపీలోకి విచ్చేసిన 10 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, దామా మల్లేశ్వరరావు, బోగినేని వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్లు, అల్లం రాధయ్య, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జలదంకి-తెల్లపాడు రహదారి విస్తరణ పనుల ప్రారంభం


అన్నవరం సమీపంలో జలదంకి-తెల్లపాడు రోడ్డుపై నిర్మాణంలో ఉన్న వంతెన

జలదంకి, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): జలదంకి-తెల్లపాడు రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కొంతకాలం గా బిల్లులు రాలేదన్న కారణంతో గుత్తేదారు పనులు ఆపేసిన సం గతి తెలిసిందే. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో గుత్తేదారుకు బిల్లులు అందడంతో రోడ్డు విస్తరణ ప నుల్లో భాగంగా వాగులపై నిలిచి ఉన్న వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించారు. అన్నవరం, దాసరిఅగ్రహారం క్రాస్‌రోడ్డు, తిమ్మసముద్రం లహరిఫామ్స్ సమీపాన, క్రాకుటూరు రోడ్డు మలుపు వద్ద నాలుగు చోట్ల వంతెనల పనులు జోరుగా సాగుతున్నాయి.

కోటూరుపల్లిలో దర్గా ప్రారంభం


దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

కలువాయి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటూరుపల్లిలో పునర్నిర్మించిన మసుంషావల్లి దర్గాను ఆదివారం ప్రారంభించారు. నెల్లూరులో నివాసం ఉంటున్న గ్రామానికి చెందిన చాంద్‌బాషా తన స్వంత నిధులతో దర్గాను పునర్నిర్మించారు. ఆదివారం దర్గాను ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా, విక్రయాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ అన్వర్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రానున్న దీపావళి నేపథ్యంలో పెద్దఎత్తున బాణసంచా విక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున వ్యాపారులు తప్పకుండా పోలీసు, రెవిన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందాలన్నారు. బాణసంచా హోల్‌సేల్ వ్యాపారులు నిల్వ గోదాముల్లో తగు భద్రతా ప్రమాణాలు పాటించాలని, రిటైల్ వ్యాపారులు బహిరంగ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటుచేసుకోవటంతో పాటు ప్రతి దుకాణం వద్ద ఓ నీళ్ల డ్రమ్ము, పొడిఇసుక, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటుచేసుకోవాలని స్పష్టంచేశారు. కందుకూరు సర్కిల్ పరిధిలోని మండలాల్లో ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, తయారీకేంద్రాలు ఉంటే పోలీసులకు ముందస్తు సమాచారం అందించటం ద్వారా ప్రమాదాలు అరికట్టాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక


శాలివాహన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి సుబ్బారావు

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గం కుమ్మరి శాలివాహన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అద్దంకి సుబ్బారావు నేతృత్వంలో పట్టణంలోని జనార్ధనస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడుతూ కుమ్మరులకు చట్టసభలలో ప్రాతినిధ్యం దక్కటమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం అధ్యక్షుడిగా కలికివాయి కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా కలికివాయి మాల్యాద్రి, గౌరవ సలహాదారులుగా డా.ఉప్పుటూరి వెంకయ్య, డా. కరేటి రామరాఘవులు, కార్యదర్శిగా అద్దంకి మాల్యాద్రి, కోశాధికారిగా ముసిలిమడుగు కొండయ్య, ఉపాధ్యక్షుడుగా కలికివాయి నవీన్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మొగిలిచర్ల సుబ్బారావు, కెఎస్ నర్సయ్య, పెళ్లూరు శ్రీనివాసులు, ఎడవల్లి వెంకటేశ్వర్లు, చింతకుంట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అనంతసాగరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ నమోదు చేసుకోని గిరిజనుల కోసం సోమవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గిరిజనులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

చేతిపంపు బాగు చేయండి సారూ..


మరమ్మతులకు గురైన చేతిపంపు

సంగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో షాది మంజిల్ పక్కన ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురై గత కొంతకాలంగా పనిచేయక పోవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. పంచాయతీ కుళాయిలు ఉన్నా కరెంటు ఉంటేనే నీళ్లు వస్తాయి. కూలి పనులకు వెళ్లేవారు కుళాయి నీళ్లు పట్టుకోలేకపోతే ఇక ఆరోజు నీళ్లు లేనట్లే. అదే చేతిపంపు పనిచేస్తుంటే నీళ్లు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన చేతిపంపును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతులు తీసుకోవాలి

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణాలకు తప్పనిసరిగా రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాసుల విక్రయ దుకాణాలకు అనుమతులు లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. టపాసుల దుకాణాలను ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి): కావలి మండలం తాళ్లపాలెంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అరగల వెంకమ్మ (60) నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రూరల్ పోలీసులు కథనం మేరకు, తాళ్లపాలెంకు చెందిన వెంకమ్మ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. భర్త, కుమారుడు మొదట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఘనంగా శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే


యూనివర్సిటీ టాపర్ సయ్యద్ ముస్కాన్‌ను అభినందిస్తున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలి (టౌన్) అక్టోబరు 12: మద్దూరుపాడులోని కన్వెన్షన్ హాలులో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే ఆదివారం ఘనంగా జరిగింది. చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బరామయ్య, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, కళాశాల కరస్పాండెంట్, ప్రముఖ వైద్యుడు బెజవాడ రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఉత్తమ బోధనతో పాటు ఉపాధి కల్పనకు కృషి చేస్తుందన్నారు. బీఎస్సీ బయోటెక్ యూనివర్శిటీ టాపర్ ముస్కాన్, పట్టణ టాపర్లను, ఉత్తమ క్రీడాకారులను బహుమతులతో అతిథులు అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు పి జానకీరామ్, రవికుమార్, జూనియర్ కళాశాల డైరెక్టర్లు నందనవనం మధుసూదనరావు, వెంకయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు కంపు మట్టి మాకొద్దు...!

● లబోదిబోమంటున్న టిడ్కో గృహాల నివాసితులు


టిడ్కో గృహల వద్ద రోడ్డు మార్జిన్లలో వేసిన ప్లాస్టిక్, మట్టి

కావలి (టౌన్) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బయోప్లాస్టిక్ మట్టి అంటూ కంపోస్ట్ యార్డు నుంచి మట్టిని మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో వేస్తుండడంతో ఆ దుర్వాసన భరించలేక పోతున్నామని గృహ సముదాయాల నివాసితులు వాపోతున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమనే మాట పక్కన పెడితే... చెత్త నుంచి సమస్యలు సృష్టిస్తున్నారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను డీకంపోస్ట్ చేసి బయోప్లాస్టిక్ మట్టిని తోలుతున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నప్పటికీ, మట్టి నల్లగా దుర్వాసన వెదజల్లడంతో పాటు, అందులో గాజు ముక్కలు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసివున్నాయని అంటున్నారు. ఈనేపథ్యంలో ఆదివారం సీపీఎం నాయకుడు టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. కావలి పట్టణం 40 వార్డుల విస్తీర్ణంలో ఉంటే దుర్వాసన వెదజల్లే కంపోస్ట్ యార్డు మట్టిని ఇక్కడే తోలడమెందుకని, పేదలంటే అంత చిన్నచూపా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలు సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు మరిన్ని సమస్యలు సృష్టించడం సమంజసం కాదన్నారు.

పేద మహిళ వైద్యానికి ఆర్థిక సాయం


బాధితులకు నగదు సాయమందిస్తున్న బెస్ట్ వాకర్స్

కావలి (టౌన్) అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ పేద మహిళ వైద్యానికి కావలి బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రూ. 16,000 ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట శేషయ్య మాట్లాడుతూ ప్రతినెలా ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. తుమ్మలపెంటకు చెందిన మాణిక్యాల శేషమ్మ గుండె జబ్బుతో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తమ దృష్టికి రావడంతో చేయూతనందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వైట్‌హౌస్ కొండపనాయుడు, మందా వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నల్లపరెడ్డి శ్రీనివాసులు, రైటర్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ కుమార్, ఆర్టీసీ గౌస్, సుంకు కృష్ణ, జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధం

ఆత్మకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలు దుకాణాల్లో, కూరగాయల మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉంటే జరిమానా విధించామన్నారు. మార్కెట్‌లో కూరగాయల కొనుగోలుకు వచ్చేవారు తప్పనిసరిగా సంచి తెచ్చుకోవాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ పోస్టుకు అతిథి అధ్యాపకుని నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీ ఫిజిక్స్ పీజీలో 55 శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ మరియు అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు మంగళవారం వరకు స్వీకరిస్తారని, బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వం మారినా... మారని అధికారుల తీరు



వైద్యశాలలో జగన్ ఫొటోతో ఉన్న వాల్‌పోస్టర్

ఉదయగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా అధికారుల తీరు మారడంలేదు. అందుకు ఉదాహరణే ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉన్న వాల్‌పోస్టర్. వైద్యశాలలో గత ప్రభుత్వ హయాంలో ఓపీ విభాగం వద్ద ఏర్పాటుచేసిన జగన్ ఫోటో ఉన్న వాల్‌పోస్టర్ నేటికీ దర్శనమిస్తోంది. దానిని చూసిన ప్రతిఒక్కరూ ఇక్కడ అధికారులు గత ప్రభుత్వాన్ని మర్చిపోలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.